# ఓ గూటి పక్షులు

"జీవితం క్షణభంగురం" అన్నాడు హరికృష్ణ వస్తూనే.

దశమి వెన్నెల చెట్లసందులగుండా మరకలు మరకలుగా దారంతా కప్పేసింది. బాటకు రెండు ప్రక్కలా పొదల్లా పెరిగిన పూలచెట్లు పిల్ల గాలికి తలలు ఊపుతున్నాయి. ఆ పూవుల వాసనలు మత్తెక్కిస్తున్నాయి. రాత్రి ఎనిమిది గంటలవేళ ఇళ్ళకుపోతూ హరికృష్ణ మంజరిల బాటలు చీలే చోటది.

ఇద్దరూ మందంగా అడుగులువేస్తూ నడుస్తున్నారు. అలా వాళ్ళిద్దరూ నడుస్తుంటే ఆ గలగల నవ్వులు పొదల ప్రక్కనుంచి గలగల పారే చిన్న వాగువేగంతో కలిసి ఎంతో దూరంవరకూ వినిపిస్తాయి. పిండారబోసినట్లున్న వెన్నెల వెలుగులో కూడా ఇద్దరూ చెరొక టార్చిలైటూ చేతబట్టుకొని లైటువేస్తూ ఆర్పుతూ విలాసంగా నడిచే కూడలి అది.

మధురమైన మాటలతో కూర్చిన శుభవార్త వినిపిస్తాడని ఎదురు చూస్తున్నది మంజరి. అంతకు ముందు వారం చేసుకున్న వాగ్దానం ప్రకారం ఆనాడు ఇళ్లకు చేరుకునే ముందు - బాటలు చీలిపోయే ఆ కూడలి మధ్యలో నిలబడి హరికృష్ణ చెప్పాలి మంజరికి ఆ శుభవార్తను.

టార్చి దీపం ఆర్పుతూ వెలిగిస్తూ అతడెప్పుడు ఆ మంచిమాటను చెవిన వేస్తాడా అని ఎదురు చూస్తున్న మంజరికి అతడి మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"అదేమిటి? నీవేదో శుభవార్త చెబుతావని నేను కొండంత ఆశతో ఉంటే వేదాంతం మాట్లాడతావేం?" చిరుకోపంతో ఓరగంటితో చూసింది మంజరి.

"కాదంటావా? నిజాన్ని ఎదుర్కోలేక మనమేదో ఊహాగానాలు చేస్తాము. కృత్రిమమైన సంతోషంలో మునిగిపోతాము." అతడి దృష్టంతా ఆ చెట్ల పూలమీద ఉన్నది. ఆ పూలు సాయంకాలము విచ్చుతాయి సువాసనలు వెదజల్లి మత్తెక్కిస్తాయి. ఆ రాత్రంతా యౌవనపు మత్తులో తేలి ఆడతాయి. తెల్లవారి రాలిపోతాయి అట్లా రాలిన పూలు చెట్లక్రింద కుప్పలు కుప్పలుగా పడిఉన్నాయి.

మంజరి కతడిధోరణి అయోమయంగా ఉంది. అర్థంలేని చూపొకటి అతడి మీదికి విసిరింది.

"మంజరీ, నా సమాధానం కోసం మరింక ఎదురు చూడకు. నన్నేమీ ప్రశ్నించకు" ముఖం దింపుకుని గబగబా అడుగులు వేశాడు.

అభిమానం దెబ్బతిన్నట్లయింది మంజరికి. ఈ నాలుగేళ్ళ పరిచయంలో అతడి స్నేహంలోని తీయదనాన్ని చవిచూసింది. అతడు చాలా ఉదారస్వభావం కలవాడు. మంజరి పట్ల ఎంతో సౌమ్యంగా మర్యాదగా ప్రవర్తిస్తాడు. తనకు తెలియకుండానే ఎదలో మమతలు పెంచుకుంటున్నాడు. ఆమె కనబడగానే ఎటువంటి పరిస్థితులలోతామున్నా ఒక చైతన్యమూర్తిని దర్శించినట్లు భావిస్తాడు. ఆ వెలుగులో తనలోని చీకట్లు విడిపోయాయనుకుంటాడు. ఆ అఖండ జ్యోతి తనలోని చిన్న జ్యోతిని వెలిగించినట్లు భావిస్తాడు. ఆమె సమక్షంలో అతడికి ఆనందం తప్ప మరొకటి కలగదు.

మంజరి అతడి సమక్షంలో పురి విప్పిన నెమలిలా అయిపోతుంది.

ఆ రోజతడు అట్లా ఎందుకు మాట్లాడుతున్నాడో ఎంత సేపు యోచన చేసినా ఆమెకు అంతుచిక్కలేదు. ఆమె ఉత్సాహమంతా చప్పగా చల్లారిపోయినట్లయింది.

ఇద్దరి బాటలు చీలిపోయాయి. వెనుదిరిగి చూస్తూ చూస్తూ నడిచే అలవాటుగల ఆ ఇద్దరూ తలలు వంచుకుని నడిచారు అంతవరకూ లోకమంతా వెన్నెలలు విరజిమ్మిన సుధాకరుణ్ణి నల్లటి మేఘాలు కప్పివేశాయి...

## 2

అమెరికన్ మిషనరీల కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో హరికృష్ణ సోషల్ వర్కరుగా పనిచేస్తుండగా ఒకనాడు విచిత్రంగా మంజరిని కలుసుకోవటం తటస్థించింది. మంజరికి తండ్రిలేడు తల్లి కుష్టురోగి. కుష్టురోగుల చికిత్సాలయంలో వైద్యానికని ఆమెను చేర్చుకుంటూ, డాక్టరు "మీ వెంట బిడ్డలెవరూ ఉండటానికి వీలులేదు" అన్నాడు. అతడు తెల్లడాక్టరు. ఎక్కువ మాట్లాడడు.

"నా బిడ్డకు దిక్కులేదు. ఈ నాలుగేళ్ళ పిల్లకు తిండి, బట్ట ఇచ్చి ఎవరు పోషిస్తారు?" ఆమె కన్నీళ్ళుకారుస్తూ వెనక్కుతిరిగి వెళ్ళిపోతున్నది.

తన కర్తవ్యాన్ని నెరవేర్చినట్లుగా డాక్టరు మరొక రోగిని చూస్తున్నాడు.

సిస్టర్ మరియమ్మ కాస్త వయస్సు మళ్ళింది. రోగుల విషయంలో డ్యూటీచేసి వెళ్ళిపోయేది కాదు. వాళ్ళ కుటుంబాలను గురించి వివరాలు అడుగుతూ రోగులను ఓదారుస్తూ ఉంటుంది. మంజరి తల్లి శివమ్మ కళ్ళనీళ్లు కారుస్తూ వెళ్ళబోతుంటే ఎదురుగా వచ్చి భుజమ్మీద చెయ్యివేసింది.

"నీవు ఈ పిల్లను ఎట్లా పోషిస్తున్నావు?" అడిగింది.

"నేను పనిచేయలేను. ఇంచుమించుగా బిచ్చమెత్తుకుని దీని కడుపు నింపుతున్నాను" కళ్లు ఒత్తుకుంది.

"బిచ్చమెత్తకోకుండా నేనొక ఉపాయం చెబుతాను విను నీ కిక్కడ మందులు, భోజనం ఊరికేనే ఇస్తారు. నీ బిడ్డను అనాథశరణాలయంలో చేర్చుకుంటారు. దొరనడుగు. ఎప్పుడైనా వెళ్ళి చూడవచ్చు. లేకపోతే ఆ బిడ్డనే తీసుకొచ్చి వార్డెనమ్మ నీకు చూపిస్తుంది. తప్పేంలేదు ఒప్పుకో" నచ్చజెప్పింది సిస్టరు.

అలా అనాథశరణాలయంలో చేరి చదువుకున్నది మంజరి. ఆమెకి పన్నెండేళ్ళు నిండకముందే శివమ్మ దాటిపోయింది. మెట్రిక్ పాసయిన తరువాత ఆమెకు వచ్చిన మార్కులు చూసి అధికారులు "పై చదువులు చదువుతావా ?" అని అడిగారు.

శరణాలయంలో ఉన్నప్పటికీ మంజరి అందరితో కలిసి తిరిగేది కాదు. అవసరమయినప్పుడు తప్ప వార్డెనుతో కూడా మాట్లాడేది కాదు. తల్లి పోయిన తరువాత మరింత ఒంటరిగా బాధపడుతూ ఉంటే శాంతమణి మంజరికంటె ఒక ఏడాది పెద్దది కనుక అప్పుడప్పుడు దగ్గర కూర్చో బెట్టుకుని ఓదార్పు మాటలు మాట్లాడేది. శాంతమణే మంజరిని పైచదువులు చదువుకొమ్మని ప్రోత్సహించింది.

"మంజరీ, అందరికీ పైచదువులు చదివే యోగ్యత ఉంటుందంటావా ? నన్ను చూడు. మూడేళ్ళనుంచీ మెట్రిక్ దాటలేకుండా ఉన్నాను. చదువుకో, పైచదువులు చెప్పించినవారే నీ అభివృద్ధికి కూడా కృషి చేస్తారు" నచ్చ చెప్పింది.

అధికారులు ఆశించినట్టుగా మంజరి పొరుగూర్లో ఉండి బి ఏ కూడా పూర్తిచేసింది.

శరణాలయాన్ని మిషనరీలే నెలకొల్పారు. వాళ్ళే దానిని పోషిస్తు న్నారు. వాళ్ళే విదేశాలకు ప్రకటనలు పంపుతారు - ఎవరయినా ఒక అనాథ బాధ్యత వహిస్తారా అంటూ. అలా మిషనరీల ప్రకటనల చూసి ఒకబిడ్డ బాధ్యత వహిస్తానంటూ ఒకాయన జర్మన్‌నుంచి జాబు వ్రాశాడు. సంవత్సరానికయే ఖర్చు ముందుగా పంపించి రసీదు తెప్పించుకున్నాడు.

శరణాలయాంలో ఒక్కొక్క బిడ్డకు విరాళంగా వచ్చేడబ్బు పోష ణకు చాలదు. గంజినీళ్ళతో కడుపులు నింపుకుని - అధికారులు అక్కడా అక్కడా సంపాదించే దుస్తులతో పిల్లలు జీవితాలను వెళ్ళమారుస్తారు. చారామంది ఎముకల గూళ్ళ మాదిరిగా బలహీనంగా కనబడతారు. చదువు బాగా వంటపట్టదు. ఏ కొందరో అక్కడి చదువుముగించుకొని పై చదువులు చదవగలుగుతారు. మంజరి హైస్కూలు చదువు ముగిసే వరకూ రక్త హీనంగా ఎముకలు కనబడుతూ ఉండేది. పొరుగూరికి పై చదువులకని వెళ్ళిన తరువాత పుష్టికరమైన ఆహారం లభించింది. మనిషి నిండుగా తయారయింది.

మంజరి అనాథశరణాలయంలో ఉండగా స్కూలునుంచి రాగానే ఎంబ్రాయిడరీ, సెంటర్‌లో రెండుగంటలసేపు కుట్టుపని నేర్చుకునేది. చేతికుట్టుతో అందమైన డ్రెస్సులు పిల్లలకోసం తయారుచేయటం నేర్చు కున్నది. ఈ డ్రెస్సులు కుట్టి కాలేజి లెక్చరర్ల ఇళ్లకువెళ్ళి అమ్ముతూ ఉండేది. ఆ డబ్బుతో కడుపునిండా ఆహారమూ, ఒంటినిండా బట్టా సమ కూర్చుకోగలిగేది.

ఉదయం ఎనిమిది గంటలకు చాలా సామాన్యమైన వాయిలు చీరె కట్టుకుని చిన్నపిల్లల డ్రెస్సుల పాకెటు చేతబట్టుకుని పాండురంగం లెక్చరర్ ఇంటికి వెళ్ళింది మంజరి. ఆనాడు పిల్లలంతా సెలవురోజు కనుక

ఇంట్లో ఉన్నారు. పాండురంగం భార్య నాగమణి కాఫీ, టిఫిన్ బల్లమీద పెట్టి పెద్దకొడుకు మణిని పిలుస్తోంది.

"అమ్మా! అమ్మా! నాతో నలుగురు స్నేహితులున్నారు మరి వాళ్ళకు పెట్టవా?" గడపలోనే నిలబడి అడుగుతున్నాడు.

"ఆ సంగతి నాకు తెలుసులేరా! అందరికీ తీసుకువస్తున్నా" వెనక్కు తిరిగి వంటయింట్లోకి వెళ్ళబోతుంటే మంజరి మెల్లిగా ఇంట్లో అడుగు పెట్టింది.

"మంజరీ! దేవతలా సమయానికి వచ్చావు. నాకు కొంచెము సహాయం చేయమ్మా" మంజరిని చూడగానే నాగమణికి ప్రాణం లేచివచ్చింది.

నవ్వుతూ మంజరి ఆమె చేతిలోనుంచి ప్లేట్లు తీసుకుని బల్లమీద అమర్చింది. కప్పులు, మంచినీళ్ళగ్లాసులు పెట్టింది. "ఇంకేమిటమ్మా" అని వెనుతిరగబోయే అంతలో మణి నలుగురు స్నేహితులతో బల్లదగ్గరికి రానే వచ్చాడు. మంజరిని చూడగానే "అక్కా నే చేత్తో వడ్డించి ఇవ్వవూ?" ప్రాధేయపడినట్టుగా అడిగాడు.

మంజరి నవ్వుతుంటే చూపరుల దృష్టి ఆమె పై పలువరుసలో ఒక పన్ను వెనక్కు జరిగి కల్పించే వింత అందంమీద పడుతుంది. ఆ పన్ను ఒక ఆకర్షణ. నవ్వుతుంటే ఆమె ముఖాని కదొక వింత సోయగం. ఆ సోయగాన్నిచ్చే నవ్వొకటి ఆమెకు తెలియకుండానే వెలువడ్డది.

అందరూ తలలు వంచుకుని ప్లేట్లను చేతిలోకి తీసుకున్నారు. అక్కడే నిలబడి నాగమణి చేతిలో తను తీసుకువచ్చిన డ్రెస్సులపాకెటు పెడుతున్న మంజరి ఒకసారి తల పక్కకు తిప్పి చూసింది. అతడు ప్లేటు చేతబట్టు కుని తన వంకే చూస్తున్నాడు. అంతలో నాగమణి మంజరి భుజమ్మీద చెయ్యివేస్తూ అన్నది.

"మంజరీ! ఇంత బాగా కుట్టుపని ఎక్కడ నేర్చావు?"

"మిషనరీల ఎంబ్రాయిడరీ సెంటర్లో నేర్చుకున్నాను. అక్కడ ఎంతోమంది నేర్చుకుంటున్నారు. ఆ సెంటర్లో కుట్టిన బట్టలు మళ్ళీ విదేశాలకు పంపుతారు. అంత చక్కగా తయారవుతాయి అక్కడ డ్రెస్సులు" చూపు మరలించకుండా జవాబిచ్చింది.

నాగమణి ఏదో వినీ వినబడకుండా అంటూ మంజరి బుగ్గమీద ఒక పోటు పొడిచింది.

మంజరి కిసుక్కున నవ్వింది.

అతడా నవ్వును ఎంతో మురిపెంతో చూసి ఆనందిస్తున్నాడు.

మణి అతడివంక చూసి "హరికృష్ణా, నవ్వులతో, మందహాసాలతో కడుపు నిండుతుందా? ముందు టిఫిన్ కానీయ్." భుజాలు కుదిపింది.

సిగ్గుపడుతూ టిఫిన్ అయిందనిపించాడు హరికృష్ణ.

అప్పటినుంచీ ప్రతి ఆదివారం అక్కడ కలుసుకునేవారు. పలకరింపులుమారి సంభాషణలోకి - సంభాషణలు ఆత్మీయంగా మాట్లాడు కోవటంలోకి పోయాయి. ఇద్దరూ పాండురంగం లెక్చరర్ ఇంట్లో ఇంటి మనుష్యుల్లా అయిపోయారు రెండు నెలల కాలంలో.

మంజరి పేదరికాన్ని గురించి మాట్లాడినప్పుడు తనను గురించే మాట్లాడుతోందేమో ననుకునేవాడు హరికృష్ణ. ముఖం కుంచించుకుపోయేది. తలదించుకునేవాడు.

"నా స్నేహితురాలొకతె ఉండేది. నలభై రూపాయల సంపాదనలో ముప్పైరూపాయలు తల్లిదండ్రులకు పంపేది. పదిరూపాయలలో తనకు

గడవాలి. ఆకలి చంపుకోవడానికి బెల్లంవేసిన బ్లాక్ కాఫీ కొనుక్కుని తాగేది. దుంపలు ఉడకపెట్టుకుని తినేది. ఆ పది అయిపోయిన తరువాత మంచినీళ్లతో కడుపునింపుకుని నెలజీతం కోసం ఎదురుచూసేది. ఆ పిల్ల పాతచీరెల అంగడిలో రెండు చీరెలు కొనుక్కుని కట్టుకునేది. ఇంటికి రాగానే విప్పి మడతచేసి పెట్టుకునేది. ఆ పిల్ల ముఖం పాలిపోయినట్టుంటుంది. ఎందుకో తెలుసా ? కడుపునిండా తిండిలేక" టక్కున ఆపేసింది మంజరి తన సంభాషణను.

హరికృష్ణ ముఖం చాలా గంభీరంగా ఉంది. కళ్ళు చాలా తీక్షణంగా ఉన్నాయి.

"ఏం కృష్ణా! అలా ఉందేం ముఖం? ఒంట్లో బాగాలేదా ?" ఆదుర్దాతో ప్రశ్నించింది దగ్గరగా వచ్చి.

తల అడ్డంగా తిప్పాడు.

"నీ సంగతి గ్రహించకుండా ఏమేమిటో వాగేస్తున్నాను అప్పటి నుంచీ అందుకు రాలేదు కదా నీకు తలనొప్పి ?"

"నాకు తలనొప్పి లేదు మొర్రో అంటుంటే మళ్ళీ అదేమాట మాట్లాడతావేం ?" చికాకుపడ్డాడు.

మంజరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతడెప్పుడూ ఇలా చికాకు పడలేదు.

ఇద్దరిమధ్యా మౌనం పది నిమిషాలపాటు సంచారం చేసింది.

"నీవు దేన్ని గురించి మాట్లాడినా నేను సంతోషిస్తాను. కాని దారిద్ర్యాన్ని గురించి మాత్రం మాట్లాడకు. నేనది సహించలేను." ముఖం ఎర్రగా చేసుకున్నాడు కృష్ణ.

"దార్రిద్యమంటే నీకంత అసహ్యమా ? కోట్లకొలదీ ఉన్న జనాభాలో వేలు మాత్రమే ధనికులు. ఆమాట మరిచిపోకు" కరకుగా అన్నది మంజరి.

"అయితే ఎప్పుడూ దాన్ని గురించే మాట్లాడాలా ! నీవేమయినా ఆర్చేదానివా ? తీర్చేదానివా ? ఏమయినా ప్రణాళికలు వేసి అందరినీ భాగ్యవంతులను చెయ్యగలవా ?"

"అదికాదు కృష్ణా ! ఆ విషయాన్ని గురించి మాట్లాడుకోవటం తప్పా ?"

"తప్పే ! నీవేమీ చెయ్యలేనప్పుడు ఆ విషయాన్ని పదే పదే చర్చించటం వాళ్ళను హీనపరచినట్లే అవుతుంది. అట్లా సాటిమానవులను హీనపరచి మాట్లాడటానికి మనకేమధికారముంది ?" నిలదీసి ప్రశ్నించాడు.

మంజరి కతడి మనసులో ఏముందో అర్థం కాలేదు. అతడెందుకు అలా క్రుద్ధుడై మాట్లాడుతున్నాడో బోధపడలేదు.

"అందరిని గురించి చర్చించుకోవటానికీ ఆలోచించడానికీ మనకు భావ స్వాతంత్ర్యము ఉంది. అయినా నేనెవరినీ హీనపరచి మాట్లాడలేదు. నేను ఇవాళ ఈ ఊళ్లో బి. ఏ. చదువుతున్నానంటే - ఈ చిరగని చీరె కట్టుకున్నానంటే డబ్బు ఉండి చదువుతున్నానా ? తల్లిదండ్రి ఉండి ప్రేమతో నన్ను తమ డబ్బుపెట్టి చదివిస్తున్నారా ? ఇదంతా పైపై మెరుపు. నేను ఒక అనాథను బిచ్చమెత్తుకుని అమ్మకు కూడా తెచ్చి పెట్టాను. గంజినీళ్ళతో అనాథ శరణాలయంలో పెరుగుతూ కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని చదువుకున్నాను. ఎందుకో తెలుసా ? ఈ దారిద్ర్యాన్ని గెలవటానికి ! ఎప్పుడూ నవ్వుతూ ఉంటాను ఎందుకనుకున్నావు ? భోగభాగ్యాలలో ఓలలాడుతూ సుఖసంతోషాలతో జీవితం

గడుపుతున్నందుకు కాదు. దార్రిద్య్రం అనుభవిస్తూ కూడా తృప్తిని మనసులో పండించటానికి. "నవ్వేసెయ్యి - మనసు తేలికపడుతుంది. మెదడు ఆలోచించ గలుగుతుంది" అన్నదానిలో నమ్మకముంచి కనుక. కృష్ణా తప్పా ?"

బరువుగా నిట్టూర్చాడు హరికృష్ణ. ఇంత బరువును గుండెలో నింపుకొని కిలకిలనవ్వుతూ తేలికగా జీవించటం సాధ్యమా ? ఆలోచనలలో పడి ఇసకలో పుల్లతో గీతలు గియ్యటం మొదలు పెట్టాడు.

"కోపం తగ్గిందా ? లే అట్లా పోదాం. కాస్త గాలిలో తిరిగితే కోపం చల్లారుతుంది."

అతడు తల ఎత్తలేదు.

"నేను నిన్నేమీ కించపరచే మాట లనలేదనుకుంటే - లే - అట్లా పోదాం" చెయ్యిపట్టి లాగింది.

అతడు వెనక్కు లాక్కున్నాడు.

ఒంగి రెండుచేతులూ పట్టుకుని లాగుతూ "ఫరవాలేదు. అబ్బాయి బాగానే బరువున్నాడు" అన్నది పళ్ళు బిగించి.

ఇక ఆగలేక నవ్వేశాడు హరికృష్ణ లేస్తూ.

"అమ్మయ్య ! అబ్బాయిగారికి నవ్వొచ్చింది. ఇంక ఫరవాలేదు" చీరె కంటిన ఇసుక దులుపుకుంటూ ముందుకు నడిచింది వెనక్కు తిరిగి చూస్తూ.

పది అడుగుల వెడల్పుగల రోడ్డది. రోడ్డుకు రెండు పక్కలా చిన్నా పెద్దా ఇళ్ళు. అన్ని ఇళ్ళలో వాకిటి ముందు కొబ్బరిచెట్లు. ఇళ్ళులేని చోట ఏవో పొదలు పొదలుగా అడివి పూలచెట్లు దట్టంగా ఉన్నాయి. ఎండుటాకుల గలగలలో ఇద్దరూ నడుస్తున్నారు.

అబ్బాయిగారు చాలా కష్టపడ్డారు. క్షేమంగా ఇంటికి వెళ్ళండి. మళ్ళీ రేపు కలుద్దాము" గబగబా అడుగులువేస్తూ తన గదికి చేరుకుంది మంజరి.

## 3

దక్షిణదేశంలో నాగర్‌కోయిల్‌కూ కన్యాకుమారికీ మధ్యగా ఒక పల్లెటూరిలా ఉన్న నెయ్యూరిలో సామర్‌వెల్ హాస్పిటల్. ఆ చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటికీ ఒకేఒక వైద్యాలయం అది మిషనరీలది కావటంచేత అమెరికనులే డాక్టర్లుగా పనిచేసేవారు. భారతీయుల కందరికీ ఆ వైద్యాలయంలో వైద్యచికిత్స జరిగేది. పడకలు కూడా వేశారు కాని - అమెరికనులకని వేరే ప్రత్యేకంగా దూరంగా పది ఎకరాల తోటలో వాళ్ళకు క్వార్టర్సూ - వాళ్లకు ప్రత్యేకంగా నర్సింగ్‌హోమూ, టెలిఫోనూ - అమర్చబడ్డాయి ఆ తోటలో రకరకాల పూలచెట్లు ఫలవృక్షాలతో ఆ క్వార్టర్సు సరిగా కనబడకుండా మూసుకుపోయి ఉంటాయి. ఆతోటలో ఉన్న చెట్లకూ క్వార్టర్సుకూ నీళ్ళు బావినుండి పంపుద్వారా సరఫరా అవుతాయి. నీళ్ళ బాధ్యత, చెట్ల బాధ్యత సుబ్బన్న తాతది. అతడు అరవై ఏళ్లకు పైబడ్డవాడు, భార్యలేదు. కోడలు చేసిన తప్పుకు కొడుకు విరక్తి చెంది సైన్యంలో చేరిపోయాడు. సుబ్బన్న తాతకు సంసారంలో మిగిలింది ఒక్క పదేళ్ల వజ్రి.

"తాతా నాకు చెట్లపని నేర్పు" అంటూ వెంట తిరిగేది.

"వద్దే వజ్రీ. నీవు కూడు వండిపెట్టు చాలు" అనేవాడు.

వజ్రి నల్లని నలుపు. కాని రూపురేఖలు అపురూపమయినవి ఆమె విశాల నేత్రాలలో మెరుపు - ఏదో అసామాన్యమయిన ఆకర్షణ ఎదుటి వారిని నిలబెట్టి కవ్విస్తాయి. తాతతోపాటు చెట్లదగ్గర కాలం గడుపుతూ ఉండేది. చిన్న చేతులతో చెట్లపాదులలో ఉన్న ఎండుటాకులను తొలగిస్తూ ఉండేది. కాలవలగుండా నీళ్లు సరిగా పారుతూ ఉండేటట్టుగా ఆకులు అలం అడ్డంగా ఉన్న పుల్లలూ తీసివేస్తూ ఉండేది.

సుబ్బన్న తాతకు ఆ తోటలో ఒక పక్కగా రెండు గదుల ఇల్లు ఉన్నది. విద్యుద్దీపాలు పెట్టించుకున్నాడు. ఆతడికి కావలసిన కాయ, కూర, పండ్లు, పంటచెరకు ఆ తోటలోనివే.

వజ్రికి పధ్నాలుగేళ్ళు వచ్చేసరికి మిషనరీ హాస్పిటల్లో కొన్ని మార్పులు వచ్చాయి. సూపర్నెంటుగా కుటుంబంతో ఉన్న కింగ్స్లీ వెళ్ళి పోయాడు. అతనికి బదులుగా ఆల్బర్టు వచ్చాడు.

ఆల్బర్టుకు కేటాయించిన బంగళా డాక్టర్ల క్వార్టర్సుకంటె కొద్దిగా పెద్దది. అనేక ఆధునిక సౌకర్యాలతో అమర్చబడిన దా భవనం. ఆల్బర్టు ఒంటరిగా ఉండేవాడయినా ఇల్లంతా ఫర్నిచరుతో నిండి ఉన్నది. అతడొక గదిలో చదువుకుంటాడు. హాలులో వచ్చినవారితో మాట్లాడుతూ ఉంటాడు వరండాలో కూర్చుని సిగార్ కాలుస్తాడు. పెద్ద డైనింగ్ హాలులో గుండ్రటి బల్ల ముందు కూర్చుని భోజనం చేస్తాడు. నాలుగువైపులా దీపాలతో ధగధగలాడే పడకగది - గోడలనిండా అద్దాలతో మెరిసిపోతూ ఉంటుంది.

ఆల్బర్టు వచ్చిన మరునాడే సుబ్బన్న తాతను పిలిచి అడిగాడు. ఇంటిపని చూసుకుంటూ వంటచేస్తావా అని. ఒక వార్డుబాయి వచ్చీరాని ఇంగ్లీషులో దొరనడిగి తెలుసుకుని సుబ్బన్న తాతకు అనువాదం చేసి చెప్పాడు.

సుబ్బన్నతాత తనపని తాను చేసుకోనిపోయే రకంగాని అన్ని పనులు కల్పించుకుని చేసి చెయ్యిజాపే రకంకాదు, ఎవరేపని చేసిపెట్ట మన్నా - డబ్బు ఆశజూపినా లొంగనిరకం.

"నాపని తోటపని" అంటూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

ఆల్బర్టుకు హాస్పిటల్లో పనిచేసే డాక్టరు ఆదిత్య వంటకు మనిషిని కుదిర్చి అతడికి తగిన ఏర్పాట్లన్నీ చేశాడు. వచ్చిన కొద్దిరోజులకే ఆల్బర్టు ఆ ఊరు తను పుట్టి పెరిగిన ఊరుగా భావించటం మొదలు పెట్టాడు. ఆ చుట్టుప్రక్కల గ్రామాల నుండి హాస్పిటల్‌కు కేసులు విప రీతంగా రావటం మొదలు పెట్టాయి. అతడు మంచి సర్జన్ అన్న పేరు పాకిపోయింది. హాస్పిటల్లో అమెరికన్లు వెళ్ళినప్పుడల్లా నేర్పరులయిన భారతీయ డాక్టర్లను నియమించటం మొదలుపెట్టారు మిషనరీలు. అంతకు పూర్వము పనిచేసిన సూపర్నెంటులు భారతీయులను అమెరికన్లుతో సమా నంగా చూసేవారు కారు. కాని ఆల్బర్టు సమభావంతో చూడటం మొదలు పెట్టేసరికి డాక్టర్లందరికీ అతడిమీద గౌరవభావం అధికమయింది. చాలా శ్రద్ధతో పనిచేసేవారు. అందరిలో ఉత్సాహం పాలు ఎక్కువయింది.

రాత్రి పదకొండు గంటల సమయం. ఆల్బర్టు అప్పుడే పడుకోటానికి పడక గదిలోకి వెళ్ళాడు. నైట్ డ్రెస్సు వేసుకుందామనుకుంటూ ఉండగా అర్జంటుగా హాస్పిటల్‌కు రమ్మని ఫోను వచ్చింది.

ఆల్బర్టు ఉరుకు పరుగులమీద నాలుగు ఫర్లాంగుల దూరమున్న హాస్పిటల్‌కు చేరుకునేసరికి పేషంటు బల్లమీద ఉన్నాడు. క్షణాలమీద ఆపరేషనుకు కావలసిన ఏర్పాట్లు జరిగాయి. పొత్తికడుపులో పెరుగు తున్న ట్యూమరును ఆపరేషన్‌చేసి తీసేశాడు. రోగికి ఒంటిమీద స్మారకం వచ్చిన తరువాత అతడిని పలకరించి ఇల్లు చేరుకున్నాడు.

ఆల్బర్టుకు ఇక్కడి సంగతులన్నీ ఒక్కొక్కటే అర్థమవు తున్నాయి ఇప్పుడిప్పుడే. ఆడవాళ్లు ఆడంబరంగా పట్టుచీరెలూ, జరీ అంచు చీరెలూ వెండి, బంగారం నగలు ధరిస్తారు. కుచ్చెలుపెట్టి గుడారంలా చీరెలుకట్టి ఒళ్ళంతా కప్పుకుంటారు. రంగు నలుపయినా కొందరు అందంగా, ఆకర్షణీయంగా ఉంటారు. ఆపరేషను చేసిన రోగి మత్తుమందు ఇచ్చేవరకూ కమల కమల అంటూ కలవరించాడు. ఆ కమల ఎవరో ఆల్బర్టు చూద్దామనుకున్నాడు.

థియేటరునుంచి బైటికి రాగానే వరండాలో కళ్లుతుడుచుకుంటున్న ఇరవై ఏళ్ళ అమ్మాయి కనబడ్డది. ముక్కుకూ, చెవులకూ పెట్టుకున్న వజ్రాల నగలు జిగజిగ మెరిసిపోతున్నాయి. చేతులకు పెట్టుకున్న రాళ్ళ గాజులు, బంగారు గాజుల మధ్య ధగధగ లాడుతున్నాయి జానెడు జరీ అంచుల నీలం పట్టుచీరె కట్టుకుంది కొంగు పక్కకు జరిగింది కాబోలు- బంగారు గొలుసుల కట్ట మెడలో మిలమిల మెరిసింది.

ఆల్బర్టు వరండాలో నిలబడి డాక్టరు ఆదిత్యతో రోగిని గురించి మాట్లాడుతూ క్రీగంట చూశాడు ఆమెను!

ఆమె రంగు నలుపు. కాని ఆ నగలతో - ఆ అలంకారాలతో వింత అందంతో ఆకర్షణీయంగా కనబడుతోంది.

సిగార్ ముట్టించి ఏదో ఆలోచించుకుంటూ ఆల్బర్టు నడుస్తున్నాడు అతడికి చదువుకునే రోజులనుండీ జేనుతో పరిచయం. చాలా స్నేహంగా వుండేవారు. పెళ్ళిచేసుకుందామని నిశ్చయించుకున్నారు. కాని జేనుకు స్నేహితు లెక్కువ. వాళ్ళతో ఎప్పుడూ కులాసాగా కాలక్షేపం చేస్తూ ఉంటుంది. ఆల్బర్టును వాళ్ళల్లో ఒకడుగా చూస్తుంది. కాని పెళ్ళి చేసుకో దలచిన వాడుకదా అని ప్రత్యేకంగా చూడదు. ఆల్బర్టుకు విసుగేసింది. ఆమెతో స్నేహం వదులుకున్నాడు. తరువాత అతడి జీవితంలోకి లిల్లీ

వచ్చింది. పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరు పిల్లలు పుట్టారు. కాని లిల్లీ చాలా సాదా మనిషి. తనకు ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ కలిగించలేని మనిషిగా కనబడ్డది. కాని ఆమె అంతరంగం వేరుగా ఉంది. ఆమె ప్రేమించిన థామస్ ఆమెతో ఘర్షణపడి వివాహ విచ్ఛేదం చేసుకున్నాడు. ఆమెలో అతడి స్మృతులు చెరిగిపోలేదు. మనసులో పట్టి పీడిస్తున్నాయి మనసు లేని ఆమె ఒక యంత్రంలా తోచింది ఆల్బర్టుకు. బాగా తాగుడు అలవాటు చేసుకుని ఆమెను వదిలిపెట్టి దూరంగా ఈ దేశానికి వచ్చేశాడు.

నాలుగు సంవత్సరాల తరువాత ఆల్బర్టు ఎడ్రసు తెలుసుకుని లిల్లీ ఉత్తరం వ్రాసింది నాలుగురోజుల క్రిందట. ఆమె అత్యధికంగా ప్రేమించిన థామస్ చనిపోయాడట. పిల్లలిద్దరూ తండ్రిని చూడాలని కలవరిస్తున్నారట థామస్‌పోయిన తరువాత తన జీవితం నిస్సారమనిపిస్తోందట. ఆమె ఆల్బర్టుపట్ల ఏవయినా పొరబాట్లు చేసి ఉంటే క్షమించమనీ మళ్ళీ తామిద్దరూ కలిసి ఉందామనీ ప్రేమతో అర్థించింది.

ఆల్బర్టుకు అసహ్యమేసింది. పిల్లలు కలవరిస్తున్నారని ఆహ్వానిస్తోంది. ఒక విధంగా ప్రలోభ పరుస్తోంది. కాని - ఆ చిన్నవాడి కళ్ళూ, మూతీ, ముక్కూ అంతా థామసే. ఆ పిల్లలిద్దరూ తన పిల్లలేనన్న నమ్మకం లేదు అతడికి. అందుకనే సగం విరక్తి తోచింది.

ఏవేవో ఆలోచనల సుడిగుండాలలో గిర్రున తిరుగుతూ ఉండగా ఇంటికి చేరాడు ఆల్బర్టు. ఫొటో ఆల్బములు చూస్తూ బొమ్మల పత్రికలు తిరగవేస్తూ పడుకోబోతుండగా ఎవరో తలుపుకొట్టారు.

విసుగుదల చూపకుండా తలుపుతీశాడు. ఎవరో రోగులయి ఉంటారనుకుంటూ

సుబ్బన్న తాత చేతులు నులుపుకుంటూ నిలబడ్డాడు. అతడి వెంబడి వాచ్‌మన్ సూరయ్య కూడా ఉన్నాడు.

"దొరా, పిల్లకు తేలుకుట్టి తెలివి తప్పి పడిపోయింది" అంటూ సుబ్బన్న తాత ఏడుస్తుంటే సూరయ్య, దొరకు తెలిసేటట్లుగా ఇంగ్లీషు మాటలు కలిపి చెప్పాడు.

చూడటానికి ఆల్బర్టు బయలుదేరుతుండగా వద్దనిచెప్పి సుబ్బన్న తాత పిల్లను భుజాలమీద పడుకోబెట్టుకుని తీసుకువచ్చాడు ఆ వరండా లోనే ఒక బల్ల మీద పడుకోబెట్టాడు, సూరయ్య సహాయంతో.

తెల్లవార్లూ ఇంజక్షనులు ఇస్తూ బల్ల దగ్గరే కుర్చీవేసుకుని కూర్చున్నాడు ఆల్బర్టు క్రమంగా రోగిలో వస్తున్న మార్పులు గమనిస్తూ ఉత్సాహంగా చికిత్స చేస్తున్నాడు.

ఉదయం ఎనిమిది గంటలకు వజ్రి మెల్లగా కళ్లు తెరిచింది. వేడి వేడి కాఫీ గొంతులో పోయించాడు ఆల్బర్టు. ఆమెకు నీరసం బాగా తగ్గే వరకూ అక్కడే ఉంచమని చెప్పి తొమ్మిదిగంటలకల్లా హాస్పిటల్‌కు వెళ్లాడు.

ఆనాడు నాలుగు ఆపరేషను కేసులు వచ్చాయి. చాలా గడ్డుకేసులు. అవి అప్పటికప్పుడు ఆపరేషను చెయ్యవలసినవి. ఎంతో నైపుణ్యంతో గబగబా చేసి ఇంటికి వచ్చేసరికి రెండుగంటలయింది.

ఆల్బర్టు వచ్చేసరికి వజ్రి నిద్రలో ఉంది. ముఖంమీద వెంట్రుకలు గాలికి ముసురుకుంటున్నాయి. ఆ ముడుచుకున్న పెదవులు-మూసుకున్న కళ్ళు అతడికి చాలా వింతగా కనబడ్డాయి. హాలులోకి వచ్చేసరికి అతడికి భోజనం సిద్ధంగా ఉంది బల్లమీద. భోజనం ముగించి మళ్ళీ వచ్చి వజ్రి పడుకున్న బల్ల దగ్గరగా కుర్చీలో కూర్చున్నాడు.

అప్పటికి వజ్రికి బాగా మెలకువ వచ్చింది. తండ్రితో మాట్లాడ గలుగుతోంది. ఆల్బర్టును చూడగానే లేవబోయింది.

వద్దని చేత్తో వారిస్తూ ఇంటికి తీసుకువెళ్ళి అన్నం పెట్టమని చెప్పాడు ఆల్బర్టు. సుబ్బన్న తాత అతడికి దణ్ణాలు పెట్టాడు. డాక్టరు ప్రాణం దానం చేసినందుకు ఇవ్వటానికి తన దగ్గర ఏమీలేదని చేతి సైగలుచేసి చెప్పాడు. కాని డాక్టరు ఋణం తీర్చుకోవటానికి ప్రతిరోజూ వంటచేసి పెడతానని చెప్పాడు. ఇంట్లో ఊడ్పు-దుమ్ము దులపటం మొదలైన పనులు తన మనుమరాలు వజ్రి చేస్తుందని చెప్పాడు.

ఆల్బర్టు సరేనని చెప్పబోతూ ఉండగా మరీ మరీ బ్రతిమిలాడాడు.

నవ్వుతూ తన సంతోషాన్ని వెలిబుచ్చాడు ఆల్బర్టు.

ఆ మరునాటినుంచీ ఆల్బర్టు ఆ యింటి తాళపుచెవులు సుబ్బన్న తాతకిచ్చి అన్నిపనులూ చేసుకోమని చెప్పాడు. ముఖ్యమయినవీ, ఖరీదైనవీ వస్తువులు పెట్టుకున్న బీరువాలు తాళం వేసుకున్నాడు. తనకు ఏయే వేళ్ళల్లో ఏమేమి కావాలో చెప్పాడు.

వజ్రి డాక్టరుకు ఆమ్లెట్టు వేసి యివ్వటం - కాఫీ తయారుచేసి యివ్వటం - గదులన్నీ ఊడ్చి, శుభ్రంచేసి పెట్టటం, మంచినీళ్ళ సీసాలు ఫ్రిజ్‌లో పెట్టటం నేర్చుకుంది. రెండు మూడు నెలలయే సరికి వంటలో కూడా నేర్పు సంపాదించింది. ఆతడి అలవాట్లకు తగినట్లుగా అన్నీ సమకూర్చటం అందివ్వటం చేస్తూ వచ్చింది.

ఇప్పుడు వజ్రి చేతిసైగలతో ఆల్బర్టుకు చెప్పటంలేదు. తీరిక వేళల్లో వార్డుబాయ్ దగ్గర, వాచ్‌మన్ సూరయ్య దగ్గర నేర్చుకునే పొడి పొడి ముక్కలతో ఇంగ్లీషులో దొర కన్నీ చెప్పటానికి ప్రయత్నిస్తోంది.

ఒకనాటి మధ్యాహ్నం దొర వచ్చేసరికి వండిన పదార్థాలన్నీ బల్లమీద అమర్చటానికి బంగళాలోకి వచ్చింది వజ్రి. బల్ల శుభ్రంగా బట్ట పెట్టి తుడిచి తెల్లటిబట్ట పరచింది. పళ్ళేలు, చంచాలు అలవాటు ప్రకారం

అమర్చింది. వంటకాలు గాజు గిన్నెలతో తెచ్చిపెట్టి మూతలుపెట్టింది. భోజనంచేసి పడుకుంటాడని పక్క శుభ్రంగా దులిపి - తెల్లటి దుప్పటి పరచింది. స్నానాల గదిలో సబ్బు, నీళ్ళు ఉన్నాయో లేదో చూసి వచ్చింది.

సాధారణంగా అన్నిపనులు చేసిన తరువాత ఆల్బర్టు వచ్చేవరకు వీధిమెట్లమీద కూర్చుని సన్నగా పాడుకుంటూ ఏరుకున్న పువ్వులు ఒడిలో పోసుకుని దారంతో మాలగా కట్టుకుంటూ ఉంటుంది.

మధ్యాహ్నం రెండు కావచ్చింది. డాక్టరు ఇంకా రాలేదు. వజ్రకి ఏదో పని తాను మరచినట్టు జ్ఞాపకము వచ్చింది. చివాలునలేచి తోటంతా తిరిగి పూలు కాడలతో కూడా కోసి గాజు గిన్నెలో గుత్తిగా అమర్చి నీళ్ళు పోసింది. ఇంకా ఏమయినా మరచిపోయానేమో ననుకుంటూ ఒక్కొక్క పనే జ్ఞాపకం చేసుకుంటూ, చేసానో లేదో అని రూఢి చేసుకుంటూ, ఇల్లంతా తిరుగుతోంది. ఆమె కళ్ళకు అతడు పడుకునే గదిలో బల్లమీద పుస్తకాల దొంతర చెదిరిపోయినట్లనిపించింది. దుమ్ముదులిపే బట్టతెచ్చి ఒక్కొక్క పుస్తకమే దులిపి తిరిగి దొంతరగా పేర్చింది. వాటిలోనుంచి జారిపడ్డది ఒక పెద్ద పుస్తకం అది లేవనెత్తబోయేటప్పుడు దానిలోనుంచి ఫోటోలు కిందికి జారాయి.

సంభ్రమంతో ఒక్కొక్క ఫొటో కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తోంది వజ్రి.

ఇద్దరు మగపిల్లలు బాగా బొద్దుగా ఉన్నారు. తేనె రంగులో జుట్టూ, కళ్ళూ వింతగా కనబడ్డారు వజ్రికి

"ఎంత లావుగా ఉన్నారో! దొరలు పిల్లలకు ఏం పెడతారో అంత లావు కావటానికి ? బట్టలు చాలా అందంగా ఉన్నాయి" అనుకుని మరొకటి చేతిలోకి తీసుకుంది.

"ఛీ! ఇదేం బొమ్మ!" అనుకున్నది కానిదానినే మళ్ళీ మళ్ళీ, తిప్పి తిప్పి చూసింది. ఆమె కళ్ళు ఆర్పకుండా దాని వంకే చూసింది గంటసేపు.

దొర, దొరసాని ముఖాలు దగ్గర దగ్గరగా పెట్టుకుని తీయించుకున్న ఫోటో అది.

ఆ దొర ఆల్బర్టు. ఆ దొరసాని ఆయన భార్య అయి ఉంటుందనుకున్నది.

దొర కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి. ఆ నవ్వులో కవ్వింపు ఉన్నది.

దొరసాని చాలా అందంగా ఉన్నది. ఒత్తయిన తేనెరంగు జుట్టు, విశాలమయిన కళ్ళు. ఎదటివారిని చూపులతోనే మత్తెక్కించే కళ్ళవి.

వజ్రికి ఆ అందాలనూ, సొగసులనూ ఏమంటారో తెలియదు. కాని చాలా చాలా అందంగా చూపులు తిప్పుకోలేనట్టుగా ఉన్నాయి. ఆ ఫోటో వదిలిపెట్ట బుద్ధికాలేదు ఆమెకు. కిందపడిన ఫోటోలన్నీ బొత్తిగా పెట్టి, రెండు చేతులతో సర్ది ఆ పుస్తకంలో పెట్టేసింది. కాని ఆ దొర, దొరసాని ఫోటోమాత్రం తన జాకెట్టులో భద్రపరచుకున్నది. డ్రాయింగు రూములో చిన్న బల్లమీద ఉన్న దొరఫోటో నవ్వుతూ ఉన్నది - తన కొంగుతో తుడిచి దానివంకే చూపు నిలిపి చూస్తున్నది.

మూడున్నర గంటలకు మెట్లమీద దొర బూట్లచప్పుడు వినిపించింది. వజ్రికి ఏదో గుబులు - భయంలాంటిది వెన్నుపొడుగునా జరజర పాకినట్లయింది. కాళ్ళల్లో వణుకు పుట్టింది. ఒక్క పరుగులో ఇంటికి వెళ్ళి పడాలని ప్రయత్నించింది.

అప్పటికి ఆల్బర్టు ఐదారుమెట్లకంటె ఎక్కువ ఎక్కలేదు. పరుగెత్తబోతున్న వజ్రికాలు మెట్లమీద జారి ఆమె దేహం ఉండచుట్టుకున్నట్టుగా కిందిమెట్టుకు జారి నేలమీద పడ్డది.

వెనక్కు తిరిగి ఆల్బర్టు ఆమెను లేవదీసి నిలబెట్టాడు. వజ్రి ఆయనకు తన ముఖం చూపించకుండా పరుగుతీసింది. ఆమె పడినచోట ఆమె భద్రంగా జాకెట్టులో పెట్టుకున్న ఫోటో కిందికి జారిపడ్డది.

దాని నందుకుని ఆశ్చర్యంతో వజ్రి వెళ్ళినవైపు చూశాడు ఆల్బర్టు.

## 4

సామర్‌వెల్ హాస్పిటల్ నాలుగు అంతస్తుల భవనం. రోగులు ఉండటానికి చిన్నచిన్న గదులూ, వాటికి అనుబంధంగా నీళ్ళ గదులూ, మరుగుదొడ్లూ ఉన్నాయి. అన్ని అంతస్తులకూ పెద్ద పెద్ద వరండాలూ గదులలోకి పోయేదారులూ ఉన్నాయి. మూడువైపులా అంబర చుంబితాలయిన భవనపు టంచులు నీలం రంగుతో గీత గీసినట్లుంటాయి. నాలుగవ వైపు పెద్ద ఖాళీస్థలమూ, మూడు గేట్లూ, వాటి ముందర వాచ్‌మన్‌లూ హుందాగా కనబడతాయి. ఆ భవనం వెనుక పెద్ద కాంటీను - ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఆ భవనం గేట్ల ముందర అన్నిరకాల పళ్ళదుకాణాలూ కొనేవాళ్ళ కోసం ఎదురుచూస్తూ ఉంటాయి. రోడ్డుకు ఇటుపక్కగా చిన్న చిన్న గదులు గదులుగా ఇళ్లు బారులు తీర్చి, కొబ్బరిచెట్ల చల్లటి నీడతో శీతల పవనాలను మరిపిస్తూ ఉంటాయి. ఈ ఇళ్ళలో సాధారణంగా చుట్టు

ప్రక్కల గ్రామాలనుండి వైద్యంకోసం వచ్చేవారు బసచేస్తారు. వాళ్ళకు అందుబాటులో పప్పు, ఉప్పు అమ్మే దుకాణాలు ఉన్నాయి.

హాస్పిటల్లో పనిచేసే నర్సులంతా ఉదయం ఏడు గంటలకు వరండాలో నిలబడి ఏసుదేవుని ప్రార్థనలు చేస్తారు. ఆ తరువాత తమ డ్యూటీల్లోకి వెళ్తారు. హాస్పిటల్ భవనానికి తూర్పున ఒకటి - పడమరన ఒకటి పెద్ద ప్రార్థనా మందిరాలు, ఒక ఆర్గను ఉన్నాయి. వాటిలో ఒకదానిలో ఆదివారపు ప్రార్థనలు, పాటల కార్యక్రమాలు జరుగుతాయి. మరొక దానిలో పాటల రిహార్సల్సు జరుగుతాయి.

ఈ హాస్పిటల్‌కు నూరు గజాల దూరంలో అంతర్జాతీయ కాన్సర్ సెంటర్ ఉంది. మొదట మొదట అమెరికను డాక్టర్లు ఉన్నప్పటికీ దానిలో కూడా రానురాను భారతీయులనే డాక్టర్లుగా నియమించారు. ఆ సెంటర్ సూపర్నెంటు మహమ్మద్ అబ్దుల్లా. మిగతా డాక్టర్లు తమిళులూ, ఆంధ్రులూ, కర్నాటకులూ ఉన్నారు. ఆ హాస్పిటల్లో ఉన్న కోబాల్టు యంత్రము రోగికి ఎక్కడ కావాలంటే ఆ దిశకు తానే తిరిగి కిరణాలను ప్రసరింపచేసే యంత్రము. ఈ కాన్సర్ సెంటర్‌కు వైద్యం నిమిత్తం దూరతీరాల నుంచి కూడా రోగులు వస్తూ ఉంటారు.

ఈ కాన్సర్ సెంటర్‌వారు ఆ చుట్టుప్రక్కల ప్రదేశాలకు ఇంటింటికీ వెళ్ళి వాళ్ళ అలవాట్లనూ, వాళ్ళ యిళ్ళ పరిస్థితులనూ సర్వే చేయటానికి ఒక యూనిట్‌ను నియామకం చేశారు. ఆ యూనిట్‌లో ఒక డాక్టరు, ఒక నర్సు, ఒక సోషల్‌వర్కరూ ఉంటారు. ప్రతి దినము ఉదయము ఎనిమిది గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంటవరకూ ఇంటింటికీ వెళ్తారు. ఒక్కొక్క యింట్లో స్త్రీలెందరు, పురుషులెందరు, పిల్లలెందరో వ్రాసుకుంటారు. కుటుంబానికి ఒక కార్డు ఇస్తారు.

డాక్టరు రాజు, నర్సు ఉమ, సోషల్‌వర్కరు హరికృష్ణ ఉదయం ఎనిమిది గంటలకు వేన్‌లో బయదేరి కొబ్బరి తోటముందర ఆగి వేన్ దిగారు. ఆ పైన కాలిబాటలో పంటకాలువలూ దాటుకుంటూ ఏభయి ఇండ్ల గ్రామానికి వెళ్లారు.

ఒక ఇంటిముందర ఆగి ఇంటి యజమానిని పిలిచారు

"నీ పేరేమిటి?" డాక్టరు అడిగాడు.

"రామస్వామి" అన్నాడు.

"నీ కెంతమంది పిల్లలు?"

చెప్పాడు,

"భార్య ఉందా?"

రామస్వామి మొఖంలో మార్పు కనిపించింది డాక్టరుకు.

"ఉందా?"

"ఉన్నది" కోపాన్ని అణచుకుని చెప్పినట్టు కంఠం ధ్వనించింది.

"నీకు సిగరెట్లు తాగే అలవాటుందా?"

అతడు జవాబిచ్చే లోపుగా ఊపిరాడని దగ్గువచ్చింది.

"రోజుకు ఎన్ని తాగుతావు."

అతడు అయిష్టంగా తలవంచుకున్నాడు.

"సరే, నీవు రోజుకు రెండుమాత్రం తాగుతూ ఉండు. ఈలోపల ఒకసారి మా సెంటర్‌కు రా. వచ్చి చూపించుకో" లేచాడు డాక్టరు. సోషల్ వర్కరు హరికృష్ణ కార్డు మీదికి వివరాలు ఎక్కించుకున్నాడు.

ఈ లోపల నర్సు ఉమ, అతడి భార్య దగ్గరికి వెళ్ళి ఆమెకు తమల పాకులు పొగాకుతో కలిపి తినే అలవాటు ఉందని తెలుసుకుంది. బెంప

లోపలి భాగం పరీక్షచేసి డాక్టరికి చూపించింది. డాక్టరు బయాప్సీ తీసుకున్నాడు.

ఆ రోజు పాతిక ఇళ్ళే సర్వే చేశారు. కేన్సరు లక్షణాలు ఉన్న వాళ్ళను సెంటర్‌కు రమ్మని చెప్పి ఇళ్ళకు వచ్చారు.

మధ్యదారిలో హరికృష్ణ "డాక్టర్ ఆరాము అనే యువకుడికి ఏమిటంటారు ?" ప్రశ్నించాడు.

"అతడికి జ్వరం. దానిలో ఒకసారి రక్తం వాంతయింది. సెంటర్‌కు రమ్మన్నాను కదా !" అన్నాడు.

"ఏమిటి అతడికి ?"

"బ్లడ్‌కాన్సర్ అని అనుమానము."

"మన దగ్గరికి వస్తే ఏంచేస్తాము ?"

"ముందు అవునోకాదో టెస్టుచేసి మందులిస్తాం."

"తగ్గుతుందా డాక్టర్ ?"

"కష్టమనుకో, వాడి ఆయుర్దాయ మెంత ఉందో మరి."

బరువుగా నిట్టూర్చాడు హరికృష్ణ.

ఆశ్చర్యంగా హరికృష్ణ ముఖంలోకి చూశాడు డాక్టరు.

"అతడికి పెళ్ళిసంబంధాలు వస్తున్నాయట. ఒక పిల్లను తీసుకువచ్చారు చూపించటానికి. ఇప్పుడు పక్కగదిలో ఉంది. వాళ్ళు నిన్న ఉదయం వచ్చారట. రాత్రినుంచీ అతడికి జ్వరమట." అన్నాడు పెదవులు చప్పరిస్తూ.

"అలాగా ? పాపం."

"అయితే మీరేమని సలహా యిస్తారు డాక్టర్! పెళ్ళి వద్దనేనా ?" డాక్టరు ముఖం చూడలేక చెట్లవంక చూస్తూ అడిగాడు

"పెళ్ళి వద్దనే చెప్పాల్సి ఉంటుంది."

"అయితే అతడు బ్రతకడన్నమాట!"

డాక్టరు చురుగ్గా హరికృష్ణ ముఖంలోకి చూశాడు.

"అతడు నీకు తెలుసా ?" అడిగాడు డాక్టరు.

"అబ్బే, నాకు తెలియదు" నసిగాడు.

"అయితే నీ ముఖం అలా అయిందేం ?"

"అతడిని చూస్తే జాలేసింది" కంఠం రుద్ధమయింది హరికృష్ణకు.

"ఇది ప్రపంచమోయ్ కృష్ణా. ఒక్కొక్క కేసు ఎలా ఉంటుందనుకున్నావు ? మొదటిరాత్రి వధువు చేతికి అందించే పాలగ్లాసు అందుకోకముందే అతడికి రక్తం వాంతవుతుంది. వాళ్ళిద్దరికీ ఆ క్షణంలో ఎట్లా ఉంటుందంటావు ? ఆ పిల్ల బ్రతుకులో అతడు నింపేది ఏమిటి ? అవన్నీ తలుచుకుంటే మేము ముందుకు పోలేము "

వేను ఆగింది. అందరూ దిగారు. అందరి బాటలూ చీలిపోయాయి.

హరికృష్ణ వారం రోజులు సెలవు పెట్టాడు.

# 5

"నీ కూతురు వచ్చి ఇల్లు శుభ్రం చేయటంలేదెందుకని!" డాక్టరు ఆల్బర్టు సుబ్బన్నతాతను అడిగాడు.

"దాని కాలు బెణికింది బాబూ! వాచింది. కాలు కింద పెట్టలేక పోతున్నది. తగ్గితే వస్తుంది దొరా!" అన్నాడు.

దొరకు ఆరోజు వజ్రి తనను చూసి మెట్లమీదుగా కిందికి దొర్లటం, పారిపోయేటప్పుడు ఫోటో జారిపడటం జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు.

దొరకు ఆనాటినుంచీ ఆ సంఘటన కళ్ళల్లోనే మెదులుతున్నది. ఆ నల్లటి పిల్ల ఆ ఫోటో ఎందుకు దాచుకుంది? అతడికేవేవో చిలిపి చిలిపి ఊహలు మనసులో మెదులుతున్నాయి. తీరుబడిగా మధ్యాహ్నం వేళల్లో భోజనంచేసిన తరువాత పక్కమీద పడుకుని ఆలోచిస్తూ ఉంటాడు ఆ కమ్మటికలలు- తేలిపోయే నిద్రలో కంటూ ఉలికిపాటుతో లేస్తున్నాడు.

పదిరోజుల తరువాత దొర నిద్రలేవకముందు బంగళాలోకి వచ్చి ఎప్పుడూ తనుచేసే పనులుచేసి స్నానానికి నీళ్ళు ఉడుకుచేసి నీళ్ళగదిలో పెట్టింది. సబ్బుపెట్టె మూతతెరిచి పెట్టింది. బైటికి వస్తూ వస్తూ అక్క-డున్న అద్దంలో ఒకసారి ముఖం చూసుకుంది వజ్రి.

అంతలో దొర పక్కకు తిరిగినట్టు కనబడ్డది. గబగబా నీళ్ళగది బైటికి వచ్చింది. దొరగదిలో బల్లమీద ఉన్న ఫోటో పకపక నవ్వు తున్నది. ఒక క్షణం ఆగి నిదానంగా దానివంక చూసింది. ఎట్లా వస్తున్నది అంత నవ్వు? నవ్వుతుంటే కళ్ళు ఎంత చిన్నవయినాయో? వజ్రి ముఖంలో వింత వెలుగొకటి మెరుపులా మెరిసింది. పళ్ళు పైకి కనబడ కుండా నవ్వుకుంది.

వజ్రి మనసు అంతటితో ఆగలేదు. ఆ ఫోటో చేతిలోకి తీసుకుని కళ్ళల్లోకి చూడటం మొదలుపెట్టింది. కొంతసేపయిన తరువాత తను జాకెట్టులో భద్రపరచుకొని జారవిడిచిన ఫోటోకోసం ఆ చుట్టుప్రక్కల వెదికింది. కనుచూపు మేరలో లేదు.

అంతలో దొర మంచం కిరకిరలాడింది.

వజ్రికి గుండెలో రాయి పడినంత పనయింది. పరుగు తీసింది. ఆమె హాలు దాటేలోపల దొర గబగబా వచ్చి ఒకచేత్తో తలుపుమూశాడు. ఒకచేత్తో వజ్రి చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకువెళ్ళాడు.

దొర తన దగ్గరున్న వింత వింత వస్తువులన్నీ చూపించి ఆమెకేం కావాలో తీసుకోమన్నాడు. తన పర్సు చేతికిచ్చి ఎంత కావాలో తీసుకోమన్నాడు.

పూసల రవికలంటే వజ్రి కెంతో ఇష్టం. సుబ్బన్న తాతను ఎన్నిసార్లడిగినా డబ్బివ్వడు. నల్లచుక్కల చీరంటే ఎంతో మురిపెం. సుబ్బన్న తాతదగ్గర అంత డబ్బులేదు. పర్సు చూడగానే మొదట సందేహించింది. వజ్రి, కాని అందులో ఉన్న రూపాయలు తీసుకుని ఆ రెండూ కొనుక్కోవచ్చని ఆశపడి మూడుపదులు తీసుకుంది. దొర చూపించిన వస్తువులన్నీ ఒకసారి చూసింది. మురిపెంతో పట్టిపట్టి చూసింది. మళ్ళీ యథాస్థానంలో పెట్టేసింది.

దొరతో ఎంతో మాట్లాడాలని మనసు తొందరచేసింది. కాని తన మురిపాన్ని మాటల్తో చెప్పటానికి శక్తిలేదు అందులోనూ దొరతో చెప్పటం అసలే చేతకాదు.

ఒకనాడు దొర అన్నాడు "నీవు కూడా నాతో భోజనం ఇక్కడే చెయ్యరాదూ ?" అని.

"అమ్మో" అన్నది కళ్ళు పెద్దవిచేసి కనుబొమ్మలు పైకెత్తి.

"ఏం ?" అన్నాడు నవ్వుతూ దొర.

"తాత ! తాత !" అన్నది గొంతు పిసికేస్తాడని చేతిసైగలు చేస్తూ.

అయినా దొర మిగిల్చినవన్నీ కడిగే నెపంమీద అక్కడే కూచుని తినేది, దొర ఉన్నంతసేపూ అతడిని కళ్ళారా చూస్తూ ఉండేది.

దొర ఇంటికి వచ్చేటప్పుడు తలదువ్వుకుని శుభ్రమయిన చీరె రవిక ధరించి వచ్చేది.

ఒకనాడు చుక్కల చీరె పూసల రవిక కొనుక్కోవాలని సంతకు వెళ్ళింది. వెళ్ళేటప్పుడు తాతకు కొనుక్కోటానికి డబ్బు ఇమ్మని అడిగింది. తాత గొణిగి గొణిగి పదిరూపాయ లిచ్చాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకు వెళ్ళిన మనిషి సాయంత్రము ఆరు గంటలకు వచ్చింది. తనకు నచ్చిన చీరె, రవిక, తల్లోకి పూలదండలు, మిఠాయి పొట్లం సంచీలోంచి తీసి తాతకు చూపించింది.

"పది రూపాయలకు ఇవన్నీ ఎట్లాతెచ్చావని" తాత వేసిన ప్రశ్నకు తన స్నేహితురాలిని అప్పడిగి కొనుక్కున్నానని బొంకింది అందంగా తాతకు అప్పులంటే గిట్టదు. నోటికి వచ్చినట్టు తిట్టాడు.

కళ్ళు వాచేటట్టు ఏడ్చిన వజ్రిని తాతే మళ్ళీ సముదాయించాడు.

తాతకు ఎన్నాళ్ళనుంచో వజ్రికి పెళ్ళిచేయాలన్న సంకల్పము ఉంది. డబ్బు కూడబెట్టాడు. చెవులకు పూలు, మెడలోకి నాను చేయించి మనమరాలికి తెలియకుండా దాచాడు. ఒకటి రెండు మనువులు చూశాడు. ఒకటి తనకే నచ్చలేదు. రెండోది తనకు చాలా నచ్చింది. అతడికి పాతిక కొబ్బరిచెట్లు ఒక చిన్న ఇల్లూ ఉన్నాయి. అమ్మమ్మ తప్ప మరెవరూ లేరు. పిల్లనుచూసి అతడు మెచ్చుకున్నాడు. పనీ పాటా బాగా వచ్చునగానే ఎంతో సంతోషించాడు. పిల్లకు తను కూడా నగలు పెడతానన్నాడు. పిల్లను బజారుకు తీసుకెళ్ళి మెచ్చిన చీరెలు కొంటానన్నాడు. కాళ్ళకు పట్టాలు తన తల్లివి ఉన్నాయని చెప్పాడు.

తాత సంబరపడిపోయాడు. తన కోడలు పచ్చటి కాపురాన్ని కాలతన్నుకుపోయింది. ఆ పిల్ల యింట్లో పాదం పెట్టిననాడు తను చాలా సంబరపడిపోయాడు. తన బ్రతుకు ఆ కొడుకూ కోడలు చేతులమీదుగా గడిచిపోతుందని ఆశపడ్డాడు. కాని చివరకు ఇద్దరూ కలిసి తనమెడకే తగిలించారు వాళ్ళ కన్నబిడ్డను. ఈ వజ్రిని ఒక ఇంటిదాన్నిచేసి తన బరువు వదలించుకోవాలనుకున్నాడు.

వజ్రి తాత అన్నంతింటుంటే ఎదురుగా కూర్చునేది రోజూ. ఆనాడు ముడుచుకుని పడుకుంది.

"వజ్రీ!" తాత రెండుసార్లు బిగ్గరగా పిలిచాడు.

ఊఁ అంటూ, మరొక పక్కకు తిరిగి పడుకుంది. తాత దగ్గరికి వచ్చి బ్రతిమిలాడాడు.

తిననని గునిసింది. కొంచెమయినా తినమని తాత లేవదీసి కూర్చోబెట్టాడు. వజ్రి అన్నం తినబోయేముందు చెప్పింది - తాతా! నాకీ మనువు ఒద్దు. నాకిష్టంలేదు" అని స్పష్టంగా.

తాత నివ్వెరబోయాడు. కొంతసేపటికి తేరుకుని "ఏం? ఎందుకు ఒద్దు? పిల్లవాడు బాగాలేడా? మనకంటె ఉన్నవాడే" అన్నాడు.

నల్లగా లావుగా చెవులకు పోగులు పెట్టుకుని మోటుగా ఉన్నవాడెక్కడ నాజూకుగా ఉన్న తెల్లదొర ఎక్కడ? మనసులో ఘర్షణ జరుగుతోంది వజ్రికి.

"ఏం ఉంది? పది కొబ్బరిచెట్లూ-ఆ గుడిసె ఇంతే కదా!" అనకూడదనుకునే విసురుగా అనేసింది.

"ఆఁ! వాడికి పది కొబ్బరిచెట్లూ ఒక గుడిసేనా? మనకెన్ని ఉన్నాయే? అవీ లేవుగా! దిక్కుమాలినదానా! ఎవరు చెబుతున్నారీ బుద్ధులన్నీ?" గావు కేకలుపెట్టాడు తాత.

వజ్రి మాట్లాడకుండా అన్నం తిని తన పళ్ళెం తాత పళ్ళెం కడిగి బోర్లించింది. తిన్నచోట శుభ్రంచేసి గ్లాసులు కడిగి గూట్లో పెట్టింది.

"ఎందుకే? ఎందుకు బాగులేడు చెప్పు? అయినా నీ ఇష్టమేమిటి? వాడిచేత మూడుముళ్ళు వేయించి వాడింటికి పంపేస్తా" నన్నాడు మూతి తువాలుతో తుడుచుకుంటూ బెదిరిస్తున్నట్టుగా.

"మూడు ముళ్ళేయిస్తావా? నీ తరంకాదు. నీవు వేయించబోయే ముందు నేను, దొరయింట్లో దూరి తలుపులేసుకుంటా" నాలుక జారి అనేసింది.

"ఆఁ? దొర యింట్లో నిన్ను ఉండనిస్తాడా? నేనూరుకుంటానా? గుంజుకురానూ?" ముఖం పెంచుకున్నాడు తాత. ఒక్క ఉదుటున లేచాడు చేతిలో తుండుగుడ్డతోటి. అందిన చోటల్లా దాంతో కొట్టాడు వజ్రిని.

వజ్రి మాట్లాడకుండా భరించింది. అలిసిపోయిన తాత ఛీఛీ అనుకుంటూ పక్కచేరాడు. ఒకనిమిషం పడుకుని ఒకచేతిమీద తల వాల్చుకుని "ఇదిగో! వజ్రీ! నీవు రేపటినుంచీ దొరయింటి కెళ్తే చంపేస్తా" అని పడుకున్నాడు.

వజ్రి తెల్లవార్లూ కళ్ళు తెరుచుకునే ఉంది. తనేంచెయ్యాలి? దొర సంతానం తనకడుపులో రూపురేఖలు దిద్దుకుంటోంది. ఇంకా దొరకు చెప్పలేదు. తాతకు చెబితే కత్తితో నరుకుతాడు. తెల్లవారింది. వజ్రి మనసులో సమస్య కళపెళ్ళాడుతున్నది.

ఆరోజు తాత జీత మందుకునేరోజు. తోటపనంతాచేసి అన్నం తిని ఆఫీసుకు వెళ్ళాడు.

పన్నెండుగంటలకు వజ్రి మామూలుగా దొర క్వార్టర్సులోకి వెళ్ళింది. అప్పటికి దొర వచ్చి అరగంటయింది ? అతడికి ఆరోజు హాస్పిటల్లో పని ఎక్కువ లేదు. క్రిందటిరోజు ఆపరేషను చేసిన వాళ్ళను చూసివచ్చాడు. వజ్రి బల్లమీద వంటకాలు ప్లేట్లూ సర్దింది. దొర వచ్చి కుర్చీమీద కూర్చోగానే మామూలు నవ్వు నవ్వాడు.

వజ్రికూడా నవ్వింది. దొర భోజనం అయిన తరువాత సిగరెట్టు ముట్టించేటప్పుడు చెప్పింది. "దొరా ! బేబి బేబి" కడుపు మీద కొట్టు కొని చూపించింది.

దొర తదేక దృష్టితో ఆమెనే చూశాడు తనకూ తెలుసు ఎప్పుడో ఇలాంటి సమస్య వస్తుందని. దిగ్గునలేచి బీరువాతెరిచి రెండు నూర్లు చేతిలో పెట్టి ఆమెను గుండెకు హత్తుకుని వదిలేశాడు. "ఇంకా ఏమయినా కావాలా ?" అంటూ చేతి సైగచేశాడు. బేబి పుట్టినతరువాత తనకు తెచ్చి చూపించమన్నాడు. ఆమె వెనుతిరిగి వెళ్ళుతుంటే కను మరుగయేంతవరకు చూశాడు. సిగరెట్టు పెదవులమధ్య బిగించాడు.

వజ్రి తిన్నగా ఇంటికి వచ్చింది. తన బట్టలన్నీ సంచిలో కుక్కు తుంది. తన పళ్ళెం గ్లాసు తీసుకుంది. తన పడక దుప్పటీ జంప ఖానా మడిచి చంకకింద పెట్టుకుంది. తలవంచుకు బస్సుస్టాండుకు నడిచి వెళ్ళిపోయింది.

సాయంత్రము, నాలుగుగంటలకుగాని సుబ్బన్నతాత ఇంటికి రాలేకపోయాడు. వచ్చేటప్పుడు వజ్రికోసం తినటానికి జీడిపప్పు పాకం కొబ్బరి ఉండలు పొట్లం కట్టించుకు వచ్చాడు. గేటుదగ్గరనుండే "వజ్రీ ! వజ్రీ !" అంటూ కేకలు వేసుకుంటూ వచ్చాడు. వజ్రి పడు కుందో - పెరట్లో పని చేస్తున్నదోనని తలుపుకొట్టాడు. నెట్టగానే

రెండు తలుపులూ తెరుచుకున్నాయి. పెరట్లోకి వెళ్ళే తలుపు వేసి ఉన్నది.

దొరయింటికి వెళ్ళిందా? తను వెళ్ళద్దన్నాడుగా! అయినా దొర యింటికి వెళ్ళిందేమోనని చూశాడు. దొరయింటికి తాళం ఉంది.

ఉస్సురంటూ తాత ఇంటికి వచ్చి గడపమీద కూర్చున్నాడు. అలా కూర్చుని తాత చీకటి వెలుగులు రెండూ చూశాడు. కాని వజ్రిని చూడలేకపోయాడు.

పెళ్ళిపీటలమీద కూర్చున్న వజ్రి కళ్ళల్లో మెదలినట్లవుతున్నది.

వజ్రికి నిజంగా ఈ పెళ్ళి యిష్టంలేదా? ఎందుకు? ఎందుకు?

తాతకు అన్నం, నీళ్ళూ లేవు. ఒకటే ఆలోచన-వజ్రి ఏది? ఎక్కడుంది?

ఐదోనాడు తాత దొరయింటికి వెళ్ళి "నా వజ్రి నేంచేశావు? దాచావా? చంపావా? ఏంచేశావు?" అరిచాడు కడుపు పట్టుకుని.

దొరే వజ్రి రాలేదేమని అడుగుదామనుకుంటున్నాడు. తనకేం తెలుసు వజ్రి సంగతి? తన ఇంటికి రాలేదని చెప్పి లోపలికివెళ్ళి తలుపు వేసుకున్నాడు.

తాత ఆ మెట్ల దగ్గిరే సాగిలపడ్డాడు.

## 6

మంజరి ఎం. ఏ. ప్యాసయిన తరవాత ట్రైనింగయింది. మిషన్ స్కూల్లో హెడ్‌మిస్ట్రెస్‌గా నియమింపబడ్డది. సాయంకాలపు వేళల్లో ఎంబ్రాయిడరీ సెంటర్‌లో కూడా ఒక రెండుగంటలు పనిచేస్తుంది.

కొన్ని యింటికి తీసుకువచ్చి తయారుచేస్తుంది. హరికృష్ణతో పెళ్ళి కుదురుతుందని ఆశించింది. కొత్త కాపురంకోసం ఎన్నెన్నో సామాన్లు కొన్నది. ఎన్నో ఆశలు పెంచుకుంది. రంగురంగుల కలలు కన్నది.

కాని-హరికృష్ణ! ఎందుకింత హఠాత్తుగా మారిపోయాడు! తనలో రేకెత్తించిన ఆశా లతలను ఎందుకు మాడుస్తున్నాడు? అతడి సమస్యలేమిటి? అతడు తనను గురించి ఏమీ చెప్పడు. మరి ఎవరు చెబుతారు?

అతడితో మొట్టమొదట కలుసుకున్నప్పటినుండీ అతడికీ తనకూ మధ్య జరిగిన సంభాషణలన్నీ నెమరువేసుకుంటూ ఉంటోంది ఏమయినా దారి దొరుకుతుందేమోనని. కాని-ఎంతకూ దొరకదు.

ఒకరోజు ముఖమాటపడుతునే డాక్టరు రాజును చూసివద్దామని బయలుదేరింది. నాలుగడుగులు వేసిన తరువాత జంకింది. ఆ రోజు సెలవు. స్కూల్లో పనిలేకపోతే అసలే తోచదు. తిన్నగా నర్సు ఉమ యింటికి వెళ్ళింది. అప్పటికి ఉమ యింకా ఇల్లు చేరుకోలేదు. ఆమె తల్లి వాకిటి అరుగుమీద కూర్చుని ఉంది.

మంజరి ఆమె ప్రక్కనే కూర్చుని కబుర్లు చెప్పడం మొదలు పెట్టింది. ఉమకు తండ్రి లేడు. వయసుమళ్ళిన తల్లి మంగమ్మను పోషించటానికి ఉమ ఒక్కతే సంతానము కనుక ఆమె దగ్గరే ఉన్నది.

"ఉమ పెళ్ళిచేసుకోదా? ఉన్నట్టుండి అడిగింది మంజరి.

''నాకేం తెలుస్తుంది? చేసుకోమని చెప్తాను గాని చెయ్యలేను కదా. దానికి ముప్పయి దాటుతున్నాయి.''

తనకు ఇరవై ఆరు. ఇప్పటికే తను ఆలస్యం చేస్తున్నానను కుంటోంది మంజరి.

అంతలో ఉమ వచ్చింది కాళ్ళీడ్చుకుంటూ. ఆనాడు సర్వేచేసి వచ్చారు కనుక చాలా అలిసిపోయింది. నాలుగు కేన్సరు కేసులు బుక్ చేసుకున్నాడు. మనసు ఆందోళనకు లోనయింది.

ఉమ వాళ్ళిద్దరినీ లోపలికి తీసుకువెళ్ళింది. ఏనాటివో పాతవి రెండు కుర్చీలుంటే మంజరినీ తల్లినీ కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లింది. గబ గబా కాఫీ కలిపి మూడు కప్పులతో వచ్చింది.

"ఉమా! హరికృష్ణ సర్వేకు వచ్చాడా?" అడిగింది మంజరి మాటల మధ్యలో.

ఉమ హరికృష్ణ మనసులో మనసు లేనట్టుగా ప్రవర్తిస్తున్నాడని కనిపెట్టింది గాని- ఎందుకో తెలియదు. డాక్టరు రాజు పదేపదే హెచ్చరిస్తూఉన్నాడు. హరికృష్ణ ఉలిక్కిపడి కొంచెం సర్దుకుని జవాబులిస్తున్నాడు. ఒకసారి డాక్టరు రాజు అన్నాడు "కృష్ణా! ఏమిటి- ఒంట్లో బాగాలేదా?"

తల అడ్డంగా తిప్పాడు హరికృష్ణ.

"నీవు పెళ్ళిచేసుకో కృష్ణా- ఉత్సాహంగా ఉంటావు" అన్నాడు రాజు.

"నాకెందుకు డాక్టర్".

"ఆదేమిటి? కిందటి నెలలో సెలవు కావాలని డైరక్టరు నడిగావు. పెళ్ళికోసం కాదూ?"

హరికృష్ణ తలవంచుకున్నాడు.

"హనీమూన్‌కు వెళ్ళి నెలవరకూ రానని చెప్పావు ఒకసారి. జ్ఞాపకం ఉందా? డిన్నరు మా యింటిముందు లాన్‌లో ఇస్తానన్నావు మరిచిపోయావా? పెళ్ళికూతురిని ముందుగా మా యింటికి తీసుకువచ్చి

మాలీలకు చూపిస్తానన్నావు. ఆవిడ ఒకచీరె బ్లౌజు కొనిపెట్టింది అప్పుడే" అన్నాడు రాజు హరికృష్ణ ముఖంలోకి చూస్తూ.

హరికృష్ణ మాట్లాడకుండా ఎటో చూస్తున్నాడు.

"మా లీల ఏమన్నదో మరిచిపోయావా? మా పాపతో ఆడుకునే బదులు మీ యింట్లో ఒక పాపాయి వచ్చేటట్టు చూసుకోరాదూ అని అన అనలేదూ? నాకెందుకు నీ పెళ్ళిసంగతి అంటావా? కృష్ణా! అంటావా ఆ మాట? నావైపు చూడు." డాక్టరు రాజు హరికృష్ణతో చాలా చనువుగా మాట్లాడుతాడు అరమరికలు లేకుండా హరికృష్ణకూడా అలాగే నడుచు కుంటాడు.

"డాక్టర్! నాకో నెల సెలవు కావాలి" అన్నాడు తలవంచుకుని.

"ఇటీవల నాలుగు రోజులో ఎంతో సెలవు తీసుకున్నట్టున్నావు కదూ?"

"అవును డాక్టర్! సుస్తీగా ఉండి తీసుకున్నాను. ఇప్పుడు నెల రోజులు ఎక్కైనా తిరిగి రావాలనుంది డాక్టర్!" అన్నాడు.

"నెల రోజులు ఎక్కైనా తిరిగి వస్తావా? పెళ్ళిచేసుకుని వెళ్ళితే అర్థముంది కాని ఇప్పుడేమిటి?" ఆశ్చర్యపోయాడు డాక్టరు రాజు.

అతడి దగ్గర్నుంచి జవాబు లేకపోయేటప్పటికి రాజు అతడి దగ్గరగా కూర్చుని "కృష్ణా! ఇన్నాళ్లనుంచీ నీవు నాచేతి కింద పనిచేసే వాడివని నేను అనుకోలేదు. నా తమ్ముడిగా చూసుకున్నాను. నీ మనసులో ఏమున్నదో నాకు చెప్పకూడదా? నీకు పెద్దవాళ్ళెవరూ లేరని చెప్పావు. నీ మనసువిప్పి నాతో చెప్పు కృష్ణా. ఒకరితో చెప్పుకుంటే నీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" బ్రతిమిలాడాడు రాజు.

హరికృష్ణ మనసు ఆ మాటలకు కదిలిపోయింది. రెండు చేతులతో తల పట్టుకుని కూర్చుని కన్నీరు కార్చాడు.

డాక్టరు రాజు అతడిని తీసుకుని దూరంగా వెళ్ళి చెట్లమధ్య కూర్చోబెట్టుకుని వీపుమీద చెయ్యివేసి రాస్తూ "కృష్ణా! నాతో నీ సంగతంతా చెప్పు. నేను నీ అంతరంగికుడి ననుకో. నేను మానవమాత్రుడికి నీవు చెప్పినది బయటపెట్టను" లాలనగా అడిగాడు.

"డాక్టర్! నాతల్లి మూడునెలల గర్భవతిగా ఉన్నప్పుడు ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో ఉన్న ఊళ్ళో ఒక డాక్టరమ్మ దగ్గరికి వచ్చేసింది. ఒంటరిగా తన యింటిముందర అటూ ఇటూ తిరుగుతూ ఉండగా రెండు రోజులు చూసి మూడోనాడు ఆమె తన ఇంట్లో పైపనులు చేస్తే అన్నం, బట్ట ఇస్తానని లోపలికి పిలిచిందట. నేను పదేళ్లవాడిగా ఉన్నప్పుడు మా అమ్మ కేన్సరుతో చనిపోయింది. ఆ డాక్టరమ్మే నాకు చదువు చెప్పించి ఈ ఉద్యోగమిప్పించింది. ఇప్పుడా డాక్టరమ్మ కూడా లేదు" అంటూ కళ్లు తుడుచుకున్నాడు.

డాక్టర్ రాజు పకాలున నవ్వాడు.

హరికృష్ణ నివ్వెరపోయి అతడి ముఖంలోకి చూశాడు.

"కృష్ణా! అయితే మనుషులంతా శాశ్వతమనుకున్నావా ? పెద్దవాళ్లు పోతూ ఉంటారు. కొత్తవాళ్లు పుడుతూ ఉంటారు. అది ప్రకృతి ధర్మము. నీ తల్లి కేన్సరు వ్యాధితో పోయిందంటావా ? మనిషి పోయేటప్పుడు ఏదో ఒక వ్యాధి వచ్చి తీరుతుంది. ఏదో ఒక అవయవం పనిచేయటం మానేస్తుంది. ఏది బలహీనంగా వుంటుందో అది ముందు చెడిపోతుంది. అయినా మీ అమ్మ చనిపోయి ఇరవై ఏళ్ళు కావచ్చిందా ? ఇంకా దుఃఖపడుతున్నావా ?" రాజు కృష్ణను సాంత్వనపరచాలని చూస్తున్నాడు.

చాలాసేపు వాళ్ళిద్దరూ మాట్లాడుకోవటం చూసి ఉమ కొంత గ్రహించింది. మంజరితో ఏమి చెప్పలేక ఒక నెల సెలవడుగుతున్నాడని మాత్రం చెప్పింది.

మంజరికంతా అయోమయంగా ఉన్నది. తను హరికృష్ణను చూసి ఎంతకాలమో అయినట్టుగా ఉంది. అదివరకు ప్రతిరోజూ కలుసుకునేవారు. హరికృష్ణకు పని ఎక్కువగా ఉంటే రెండు మూడు రోజులకయినా కలుసుకునేవారు.

కాళ్ళీడ్చుకుంటూ మంజరి హరికృష్ణ యింటికి వెళ్ళింది. తాళం వెక్కిరించినట్టుగా ముందుకూ వెనక్కూ ఊగుతున్నది. బరువుగా నిట్టూర్చి వెనక్కు తిరగబోయింది.

ఆ వీధిలో రిక్షాలు సులువుగా రాకపోకలు సాగించగలవు. కారు అతి కష్టం మీద సాగిపోతుంది. వీధికి రెండు ప్రక్కలా ఇళ్లు ఒకదానికొకటి అంటుకుని ఉన్నట్టుగా ఉంటాయి. ప్రతి యింటికీ వీధి వాకిట్లో చెట్లూ పోకచెట్లూ ఉండడంచేత గొడుగు పట్టినట్టుగా నీడ ఉంటుంది. వీధి అరుగులమీద ముసలి వాళ్ళు కర్రలు పక్కన పెట్టుకుని కూర్చుంటారు సాయంత్రము కాగానే. వీధి చివర ఒక వృద్ధురాలు "అమ్మాయీ" అని పిలిచింది మంజరిని.

తడిసిన కళ్ళను రెప్పలతో ఆర్పుకుంటూ వెనక్కు తిరిగి చూసింది మంజరి.

ఎవరికోసమో వచ్చి వారు లేకపోవటంచేత నిరాశతో తిరిగిపోతున్నదని మంజరి ముఖం చూసే గ్రహించింది వృద్ధురాలు.

"ఎవరింటికి వచ్చావమ్మా ?" ప్రశ్నించింది.

"సోషల్ వర్కరు హరికృష్ణగారితో డాక్టరుగారు ఒకమాట చెప్పి రమ్మంటే వచ్చాను" అన్నది తల వంచుకుని.

"లేదా ఇంట్లో ?"

"తాళం వేసి ఉంది" చిన్నబోయిన ముఖం ఆమెలో కలిగిన నిరాశ ఎంత బరువైనదో వ్యక్తం చేసింది.

మొన్న సాయంకాలము పెట్టె తీసుకుని వెళ్లుతుండగా చూశాను" అన్నది వృద్ధురాలు.

తలాడించుకుంటూ ముందుకు నడవబోయింది మంజరి. కాళ్ళల్లో సత్తువలేదు. ఈడ్చుకుంటూ నడిచింది. హరికృష్ణను గురించి తెలుసుకోవాలంటే డాక్టరు రాజు చెప్పగలడు. కాని అతడు తనను అపార్థం చేసుకోకుండా ఉండాలి. తనకు చెప్పకుండా హరికృష్ణ ఊరికి వెళ్ళాడనుకోవటానికే ఆమె మనసు అంగీకరించటంలేదు.

# 7

"మంజరీ! మా లీల కాఫీ ఇస్తే వద్దన్నావట ఎందుకు? కాఫీ తాగవా? పోనీ పాలు తాగుతావా?" డాక్టరు రాజు లోపలినుంచి డ్రెస్సు వేసుకుని హాస్పిటలుకు వెళ్ళటానికి సిద్ధమై హాల్లోకి వచ్చాడు.

"నేను కాఫీ తాగనండీ. పాలు కూడా వద్దు." ముఖం పైకెత్తకుండా జవాబిచ్చింది మంజరి.

డాక్టరు రాజు ఆమెను బలవంతం చేయదలచుకోలేదు. ఆమె మనస్సెందుకో బాధపడుతున్నదని గ్రహించాడు.

"కృష్ణ ఊరికి వెళ్ళేముందు నీకు చెప్పలేదా మంజరీ!" సంభాషణ తనే మొదలు పెట్టాడు డాక్టరు.

లేదని తలూపింది.

"కృష్ణ నెలరోజులు సెలవు తీసుకున్నాడు. ఎక్కడైనా తిరిగి వస్తాన న్నాడు".

ఉలిక్కిపడింది మంజరి. ఆ సెలవు పెళ్ళయిన తరువాత హనీ మూన్‌కని రిజర్వు చేసుకున్నది. ఆమె గుండె జారినట్లయింది.

మంజరితో చెప్పకుండా హరికృష్ణ నెలరోజులు ఎటో తిరిగి రావటానికి వెళ్ళినట్లు రూఢిగా తెలిసిపోయింది డాక్టరుకు. అతడికి మంజరితో ఏమి మాట్లాడాలో అర్థము కావటంలేదు. ఆమె ముఖం చూస్తుంటే ఇద్దరి మధ్యా తగాదాలాంటిదేదో జరిగి ఇద్దరి మధ్యా వివాహం జరగకుండా చేస్తున్నట్టు పసిగట్టాడు. హరికృష్ణతో సన్నిహితంగా మాట్లాడినరోజున తన కర్థంకాకుండా మాట్లాడాడు.

''డాక్టర్ ! కేన్సర్ వంశంలో ఎవరికయినా ఉంటే వస్తుందా ?'' అని అడిగాడు హరికృష్ణ.

''రావాలని లేదు. కాని వచ్చిన కేసులు కొన్ని ఉన్నాయి. ఇప్పుడామాట ఎందుకు వచ్చింది ?'' డాక్టరు రాజు కృష్ణ సందేహాన్ని ప్రశ్నించాడు.

''మా అమ్మ కేన్సరుతో చనిపోయిందని డాక్టరమ్మ చెప్పింది. నాకు వచ్చే ఛాన్సు ఉన్నదా అని ప్రశ్నిస్తున్నా డాక్టర్,'' అన్నాడు.

డాక్టరు రాజు పగలబడి నవ్వాడు.

''కృష్ణా ! మనిషన్న తరువాత ఏదయినా జబ్బు రావచ్చు. ఇదే అన్నమాటేమిటి ?''

''డాక్టర్ ! పెళ్ళిచేసుకోబోయేముందు అన్ని సంగతులూ ఆలో చించుకోవాలి కదా ! కక్కుర్తిపడి పెళ్ళిచేసుకుని, పిల్లలకు వారసత్వంగా

ఇన్ని రోగాలు ఇచ్చి వాళ్ళను అల్పాయుష్కులుగా చేసినదానికంటే ముందుగా తెలుసుకుంటే మంచిదికదా! హరికృష్ణ ఇంచుమించుగా కన్నీళ్ళతో మాట్లాడాడు.

"కృష్ణా! నీ సందేహమేమిటి చెప్పు? నేనున్నానుగా నీకు అన్నివిధాలుగా సహకరించటానికి. చెప్పు?" భుజమ్మీద చెయ్యివేశాడు.

"నాకు...నాకు....సన్నగా జ్వరం తగులుతున్నది నెలరోజుల నుంచి. నాకు కేన్సరంటే భయం నాకు అది వచ్చిందని హడలి పోతున్నాను. ఇవాళో రేపో నేను పెళ్ళి కబురు చెబుతానని మంజరి ఎదురుచూస్తూ ఉంటుంది. ఆమె జీవితాన్ని నేను అనవసరంగా పాడు చెయ్యదలచుకోలేదు. ఆర్నెల్లు. ఏడాది భాగ్యానికి నేను ఆమెను జీవితాంతమూ దుఃఖపెట్టలేను" బావురుమన్నాడు హరికృష్ణ డాక్టరు చేతులు పట్టుకుని.

ఈమాత్రానికే ఇంత పిచ్చివాడవయినావా కృష్ణా. టెస్టుచేసి తెలుసుకోనిదే ఎందుకంత బాధపడుతున్నావు? రేపు పరీక్ష చేస్తాను. ఈ రాత్రికి నీవు నిశ్చింతగా ఉండు. అనవసరంగా నీవు భయపడి మంజరిని కూడా భయపెట్టేస్తావు" మందలించినట్లుగా అన్నాడు డాక్టరు. మరునాడు ఉదయం హాస్పిటల్లో పరీక్షకు రక్తం ఇచ్చి వెళ్ళిపోయాడు. అదంతా జ్ఞాపకానికి రాగానే డాక్టరు మనసులో ముల్లు గుచ్చుకున్నట్లయింది.

"మంజరీ, నీవేం బాధపడకు. అతడికి నేను ఉత్తరం వ్రాస్తాను. ముందు ఎక్కడికి వెళ్ళాడో కనుక్కుంటాను." మంజరిని ఓదార్చటానికి ప్రయత్నించాడు డాక్టరు.

మంజరి వెనుదిరిగి వెళ్లుతుంటే డాక్టరు మనసు చివుక్కుమన్నది. నిజంగా కేన్సరయితే మంజరి తట్టుకోగలదా ? హరికృష్ణ గుండె బీటువారదు కదా! ఈ ప్రేమజీవులను రక్షించు పరమేశ్వరా! గొనుక్కున్నాడు డాక్టరు.

# 8

రైల్లో కూర్చున్న హరికృష్ణకు కునికిపాట్లు, మధ్యలో ఉలికిపాట్లు, చేతిలో ఉన్న వార్తాపత్రిక జారిక్రింద పడుతోంది. మధ్యమధ్య కళ్లు తెరిచి నప్పుడు అతడి కళ్ళకు వార్తాపత్రికలో అక్షరాలు కనబడటంలేదు. సామర్ వెల్ హాస్పిటల్లో పెద్ద హాలులో తగిలించబడిన శస్త్రవిద్యలో నిపుణుడైన ఆల్బర్టు డాక్టరు ఫోటో కనబడుతున్నది. హరికృష్ణ కళ్లు గట్టిగా మూసుకుని నిద్రపట్టటానికి ఒకమాత్ర జేబులోనుంచి తీసి వేసుకున్నాడు. స్టేషను రాగానే రైలు దిగి ఒక కప్పు కాఫీతాగి వచ్చాడు. అతడికి నిద్రపట్టాలి. కళ్ళముందర ఆడుతున్న దృశ్యాలను మరిచిపోవటానికి నిద్రకావాలి.

ఒకనాడు డాక్టరు రాజు సామర్‌వెల్ హాస్పిటల్‌నుండి స్పెసిమన్‌లు తీసుకు రమ్మని పంపాడు హరికృష్ణను. అతడు హుందాగా నడుస్తూ హాలుగుండా మెట్లెక్కి పైకి వెళ్లుతూ అనుకోకుండా పక్కకు తిరిగాడు. ఆ ఫోటో చూసి దిగ్భ్రాంతుడైపోయాడు. ఆ ఫొటోలో ఉన్నవ్యక్తి ఆ మధ్య ఒకసారి ఆ ఊరు వచ్చాడు. హాస్పిటల్లో మీటింగులు, డిన్నర్లూ అయ్యాయి. అతడు హరికృష్ణను పైకి తీసుకువచ్చిన లేడీ డాక్టరుకోసం అందరినీ అడిగాడు. ఆమె చనిపోయిందని తెలుసుకున్నాడు. హరికృష్ణను గురించిన వివరాలు అడిగాడు. డాక్టరు రాజు చెప్పాడు. అప్పటినుంచీ

రాజు తనను చాలా చనువుగా కాకుండా గౌరవంగా కూడా చూస్తున్నాడు. "నీవు పెళ్ళిచేసుకుని స్థిరపడవోయ్! నేను ఏభయివేల చెక్కు ఇస్తా" నన్నాడు.

డాక్టరు రాజు కెందుకు తనమీద అంత అభిమానం! అభిమానం కలిగితే కలగవచ్చు కాని- అంత డబ్బిచ్చేటంత అభిమానమా?

సామర్ వెల్ హాస్పిటల్లో అందరూ హరికృష్ణను చూసి గుసగుస లాడుకోవటం అతడు గమనించకపోలేదు.

"అచ్చు అలాగే ఉన్నాడు" నర్సులు చెవులు కొరుక్కోవటం కూడా విన్నాడు.

ఆ తరువాత అప్పుడే చూశాడు ఆల్బర్టు ఫోటో. చటుక్కున తన పర్సులో ఉన్న చిన్న ఫొటో తనది పైకి తీసి చూశాడు. ఒక్కటే బ్లాకు. వయస్సు తేడా అంతే.

హరికృష్ణకు ఒళ్ళంతా చెమటపట్టింది. ఆ మెట్టుమీదనే నిలిచి పోయాడు అర్థంలేని చూపులతో.

అతడికి తాను బజార్లలో అప్పుడప్పుడు వింటున్న మాటలు స్ఫుర ణకు రావటం మొదలు పెట్టాయి. "తెల్లదొరలు ఈ ఊరు వచ్చి చాలా మంది పిల్లలను కన్నారు" "తెల్లదొరలను చూసి కన్నెపిల్లలు చాలామంది భ్రమపడ్డారు" "కాని ఏ తెల్లదొరా ఇక్కడ అమ్మాయిని పెళ్ళిచేసుకుని వాళ్లదేశం తీసుకు వెళ్ళలేదు." తల రెండు చేతులతో పట్టుకుని కళ్ళు మూసుకున్నాడు హరికృష్ణ.

అతడికి తన పుట్టుకమీద చాలా అసహ్యం వేసింది. నీతి నియమాలు దాటి ప్రవర్తించిన ఉద్రేకపరుల సంతానం తను! ఛీ ఛీ. ఈ బ్రతుక్కు పెళ్ళి కూడానా? అంతరాత్మ ప్రశ్నిస్తోంది.

మంజరి! నిష్కల్మషమైన హృదయంకల మంజరి ఆ కన్య హృదయంలో తను చోటుచేసుకున్నాడు. అమాయిక కాకపోతే తన జన్మను గురించి పూర్తిగా తెలుసుకోకుండా రంగు రంగుల కలలు కంటోంది. వెర్రిది. తనఫోటో కావాలని బలవంతంచేసి స్టుడియోకు తీసుకు వెళ్ళి ఫోటో తీయించింది.

కేన్సర్ అన్న తన అనుమానం నిజం కాకూడదూ? డాక్టర్ రాజు తన సందేహాన్ని ఋజువుచేయకూడదూ? ఆ సాకుతో మంజరికి పెళ్ళి పొసగదని చెప్పవచ్చుగా!

పెళ్ళి వద్దన్న భావనకే హరికృష్ణ గుండె గుబగుబ లాడింది. మంజరి హతాశురాలవుతుందని అనుకుంటేనే మనసంతా వికలమయి పోతున్నది.

కాకూడదు! ఈ పెళ్ళి జరగకూడదు. కాకుండా చెయ్యి ప్రభూ! కళ్లు మూసుకుని ధ్యానించాడు.

తన గుండె? అది పగిలి ముక్కలై సహస్ర శకలాలై పోదుకదా! ప్రభూ! నా గుండెను రాయి చెయ్యి. ఏ అనుభూతీ లేకుండా చెయ్యి. నీటి అలల తాకిడికి కొండలు నున్నగా అయినట్టు నా గుండెను కూడా చెయ్యి. బాధతో కళ్లు మూసుకున్నాడు హరికృష్ణ. అతడి కనుబొమలు ముడుచుకుపోయి ముఖం వికృతంగా మారింది.

హరికృష్ణ తిరునెల్వేలిలో దిగి బస్సు ఎక్కి కన్యాకుమారిలో దిగాడు. హిందూదేశానికి దక్షిణపు కొనలో ఉన్న కన్యాకుమారి ప్రాంతం చారిత్రకంగా ప్రసిద్ధి పొందినది. శిల్పకళావైభవంతో విరాజిల్లుతున్న ప్రదేశం. పచ్చని పర్వతాలు, జీవనదులు, కారడవులు - ఇంచుమించు యాభై మైళ్లు నిడివిగల సముద్రతీరము. శిల్పసంపద- ప్రకృతి సంపదలతో

విరాజిల్లే ఈ ప్రాంతానికి రావటంతో అతడికి కొంత మనోల్లాసము కల గటం మొదలుపెట్టింది.

తూర్పున బంగాళాఖాతం - పడమట అరేబియన్ సముద్రం - దక్షి ణాన హిందూ మహాసముద్రం- ఈ మూడు సముద్రాల నీరు కన్యాకుమారి పవిత్ర పాదాలను కడుగుతూ ఉంటుంది. హరికృష్ణ మనసు ఆ సముద్రాల మాదిరిగానే పొంగి - ఉప్పొంగి - పైకెగిసిపోతున్నట్లున్నది.

కన్యాకుమారి ఆలయం చాలా పురాతనమైనది. ఈ ఆలయం నిత్య పూజార్చనలతో శోభిల్లుతున్నది. కన్యాకుమారి ఒక దేవత- భగవతి. ఆమె పరమేశ్వరుణ్ణి గురించి తపస్సు చేయగా ఆయన మెచ్చి ఆమెతో వివాహా నికి సమ్మతించాడు. ఈ కళ్యాణ మహోత్సవానికి కన్యాకుమారిలో అన్నీ సంసిద్ధపరచబడ్డాయి. నిర్ణయించిన సమయానికి వరుడు రాలేదు. నిరాశతో ఉగ్రురాలయిన వధువు వివాహానికి ఆయత్తపరచిన అక్షతలు, బియ్యము మొదలైనవి ఇసుక రేణువులుగా మారాలని శపించిందట. భగ్నహృదయ శిలగా మారిపోయింది. ఈ కథ విన్న హరికృష్ణ అక్కడి ఇసుకరేణువులు ఎరుపు - తెలుపు - నలుపు వర్ణాలలో ఉన్న కారణమదేనని గ్రహించు కున్నాడు.

జలధితీరంలో చదరపు నేలపైన దేవి ఆలయమున్నది. ఆ ఆలయ నిర్మాణం మూడు ప్రాకారాలతో ఉన్నది. ప్రాచ్యాభిముఖముగా ఉన్న దేవి విగ్రహము ఒక అపురూపమైన కళాఖండము. ముగ్ధమోహనమూ - నిర్మలమూ - సజీవమూనై చిరునవ్వులు చిందించే కన్య విగ్రహము అది. ఆమె కుడిచేత ఒక హారాన్ని ధరించి, వామహస్తాన్ని ఉరువుపై పెట్టుకు న్నది. ఆమె వివిధాలంకారాలతో పూలమాలలతో విరాజిల్లే దేవి.

దేవాలయంలో బంగాళాఖాతానికి అభిముఖముగా ఉన్న ద్వారాన్ని ఏడాదిలో ఐదుమార్లు మాత్రమే తెరుస్తారట. ఇతర సమయాల్లో మూసి

ఉంచుతారట. దేవికి తిలకము తీర్చినది ఒక విలువగల వజ్రము. అంత కంటే విలువ గలదీ దూరతీరాలకు కూడా కాంతులను ప్రసరింపచేసేదీ ముక్కర. ఈ ముక్కర రత్నపుకాంతి నావికులను ఆకర్షించి నావలు రేవులోని బండ రాళ్ళను ఢీకొని బ్రద్దలవటం కూడా జరిగిందట.

దేవిని హరికృష్ణ పక్క నుంచి తల ఎత్తి చూడవలసి వచ్చింది. పక్కనుంచి చూస్తే మొదటి చూపుతో ఆమె తల పైకెత్తి ధిక్కారముతో సవాలు చేస్తున్నట్లున్నదా దేవి ముఖము. ముక్కుకు అలంకరించిన ముక్కరలోనుండి చిరుమంటలు లేచినట్లున్నదా వజ్రపుకాంతి. తిలకములో నున్న వజ్రము ఒక అగ్నికణములా వెలిగిపోతున్నది. భారతదేశములో ఉన్న కన్యలందరి ఆత్మగౌరవమూ- అభిమానమూ ఒక్కదేవిలో మూర్తీ భవించినట్లు కనబడింది హరికృష్ణకు.

వివాహము చేసుకుంటానని మాట ఇచ్చి ముఖం తప్పిస్తే కన్య పడేబాధ - దానిలో నుండి బయలుదేరిన కసా, కసీ దేవి ముఖంలో కనబడి నట్లుగా చలించిపోయాడు హరికృష్ణ.

దేవి ఆలయానికి ప్రక్కగా తైర్థికులు స్నానాలు చేయటానికి వీలుగా ఇనప కటకటాలతో అలవకట్టి ఏర్పాటుచేయబడ్డది. హరికృష్ణ గంటలకొలదీ ఈదుతూ ఆ నీటిలో కాలక్షేపం చేశాడు.

అతడి అదృష్టముకొద్దీ ఆనాడు పున్నమి. ఆనాడు సూర్యాస్తమ యాన్నీ, చంద్రోదయాన్నీ ఏకకాలంలో చూసే గొప్ప అవకాశము అతడికి లభించింది.

హరికృష్ణ వివేకానంద చరిత్ర గతంలో అనేక పర్యాయాలు చది వాడు. "కన్యాకుమారి అగ్రంలో - కన్యాకుమారి ఆలయంలో హిందూదేశపు తుదిశిలపై కూర్చుని నేనొక పథకాన్ని సృష్టించాను" అని స్వామి వివేకా నంద స్వీయచరిత్రలో వ్రాసుకున్నారు. ఆ రాతిమీద కూర్చుని తన ఎదుట

ఉత్తర దిక్కున ఉన్న కోటానుకోట్ల భారతీయుల్ని చూసి, వారి సేవకు తనను అంకితము చేసుకున్నాడు. హైందవ వేదాంతాన్ని, హైందవ మత సందేశాల్ని పాశ్చాత్యులకు అందివ్వటానికి సంకల్పించాడు. పవిత్రమయిన ఆ రాయిమీద కూర్చున్నప్పుడు స్వామికి కలిగిన జ్ఞానోదయము ఆయన జీవితబాటకు వెలుగుచూపించింది. సామాన్య సన్యాసిగా ఉన్న అతడి మేధస్సు పరిణతి పొందిన వివేకానందుడిగా - హైందవ ఆధ్యాత్మిక సంపదకు సంరక్షకుడిగా - జాతి నిర్మాతగా - ప్రపంచ మెరిగిన సుప్రసిద్ధ తత్వవేత్తగా రూపొందించింది.

అప్పటినుండి ఆ శిల వివేకానంద శిలగా పేరుపొందింది.

ఈ శిల సముద్రమట్టానికి 556 అడుగుల ఎత్తులో మూడు ఎకరాల విస్తీర్ణత కలిగి ఉన్నది. ఆ రాతిమీద ఒక దేవాలయ శిథిలాలుండేవి. సముద్రపు నీటి రాపిడివల్ల ఆ రాయి ఒక దీవిగా మారింది. గుడి ఆ రాతిపైన మరొక ప్రదేశానికి మార్చబడ్డది. రాతిమీద నిర్మింపబడిన మందిరాలు రెండు. ఒకటి శ్రీపాద మందిరము, రెండవది ప్రధాన మందిరము. ఈ ప్రధాన మందిరములో సభా మండపమూ, ధ్యానమండపమూ ఉన్నాయి. శ్రీపాద మండపంలో దేవి పాదముద్రలున్నాయి. సింహద్వారము అజంతా గుహల మాదిరిగా ఉంటుంది.

ప్రధాన మందిరంలో 65 అడుగుల ఎత్తుగల శిఖరం క్రింద - పరివ్రాజక రూపములో ఉన్న స్వామి వివేకానందుడి ఎనిమిదడుగుల కాంస్య విగ్రహం చూచిన హరికృష్ణ గుండె విస్మయంతో గుబగుబలాడింది. ధ్యానమండపంలో కూర్చుని తన సమస్యను గురించి ఆలోచించటం మొదలు పెట్టాడు.

ఆ విశాలమయిన ఒంటరి ప్రదేశంలో కూర్చుని ఆలోచించబోతే అతడికి ఆలోచనలు సాగలేదు. రెండు మూడు గంటలు గడిపి మదిరం

దాటి మెట్లు దిగి, స్టీము పడవమీద తిరిగి కన్యాకుమారి అగ్రం వద్దకు చేరాడు.

ముక్కడలి నీరు సంగమించే ప్రదేశానికి ఎదురుగా ఉన్న అగ్రంలో కాలి మీద కాలువేసుకుని కూర్చున్నాడు అతడికి ఆ ముక్కడలి అలల తాకిడంతా తన గుండెకే తగులుతున్నట్లనిపించింది. శూన్యదృక్కులతో కూర్చుండి పోయాడు ఆ శిలలమధ్య ఒక శిలగా మారి.

మంజరిని వివాహం చేసుకోబోయే తను ఒక అక్రమ సంతానము. తనకు పుట్టబోయేవాళ్ళు అక్రమ సంతానం యొక్క సంతానం. ఇది తర తరాలుగా నిలిచిపోయే మచ్చ.

పదహారు స్తంభాల మంటపము - దాని ముందర స్నానాలు చేయ టానికి లేవు- ఎదురుగా వివేకానందుడి ఆలయము, మేరీమాత కోవెల - క్రైస్తవ, హైందవ కన్యల పేర నిర్మితమైన దేవాలయాలు - రమణీయ మైన చరిత్రాత్మకమయిన ఆ ప్రదేశంలో కూర్చున్న హరికృష్ణ క్షుద్ర మైన తన పుట్టుకను గురించి తలుచుకుని - తలచుకుని కుంచించుకు పోతున్నాడు.

# 9

ఇంటికి వచ్చిన మంజరి ఇల్లు తాళం ఎట్లా తీసిందో - ఎట్లా లోప లికి వచ్చిందో - మంచంమీద వాలిపోయింది. దుప్పటి ఒంటినిండా కప్పు కుని కన్నుమూసింది. హరికృష్ణ తన కందకుండా పైకి - ఇంకా పైకి - దూరతీరాలకు వెళ్ళిపోయాడు. ఎత్తయిన కొండ శిఖరమ్మీద నిలబడి తనను చూసి నవ్వుతున్నాడు. ఇద్దరి మధ్యా దాటరాని నదులు - చొరలేని

అడవులు. ఎట్లా కలుసుకోవటం? అతడిని అందుకోవటానికని మంజరి మనసు పరుగెత్తి - పరుగెత్తి అలసిపోయింది.

దిగ్గున మంచమ్మీదినుంచి లేచి కూర్చుంది మంజరి. చుట్టూ చూసింది అది తన గది. ఫోటోలు, కేలెండర్లు గోడకు యథాస్థానంలో తగిలించబడే ఉన్నాయి. అయితే అదంతా కలన్నమాట!

కళ్ళు తెరుచుకొని పడుకున్న మంజరికి ఎప్పుడో తెల్లవారు ఝామున కునుకు వచ్చింది కంటిమీదికి.

ఉదయం మామూలు వేళకు ఆమె లేవలేకపోయింది. ఒళ్ళు సలసల కాగిపోతున్నది. పెదవులు, నాలుక ఎండిపోతున్నాయి.

"అక్కా! అక్కా!" ఎవరో పిలుస్తున్నారు. లేచి తలుపు తీయటానికి శక్తిలేదు. కళ్ళు తెరిపిడి పడటంలేదు.

"అక్కా! అక్కా!" ఈ మారు పిలుపు కిటికీలోనుంచి వచ్చింది.

తల ఎత్తి చూడటానికి ప్రయత్నించింది మంజరి. కానీ దేహము ఆమె స్వాధీనములో లేదు.

మంజరి ఉంటున్నది ఒక యింట్లో ఉన్న చిన్న భాగములో. ఆ యింటి పిల్లలు వచ్చి సన్నటి చువ్వతో తలుపు గడియ తీశారు.

"అక్కా! అక్కా! ఏమిటిది?" ఒళ్ళుపట్టి చూసింది ఇంటివారమ్మాయి నందిని.

"అమ్మో! జ్వరం, అక్కా లేచి కూర్చో. కాఫీ తీసుకువస్తా" పరుగులు తీసింది నందిని. ఆమె చిన్న తమ్ముడు కాళి ఆమె ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు ఆమెనే చూస్తూ. అతడికి ఆ యింట్లోకి రాగానే రెండు బిస్కెట్లు అందుకునే అలవాటు.

నందిని కాఫీ గ్లాసుతో వచ్చి మంచమ్మీద కూర్చుని మంజరిని లేవదీసి మెల్లగా కూర్చోబెట్టి కాఫీ తాగించింది.

"అక్కా, మందుతెస్తా చెప్పు. ఎవరిదగ్గర తెమ్మన్నావు?" నందిని మంజరి పక్కగా కూర్చుని చేతిగాజులు సవరిస్తూ అడిగింది.

"ఇప్పుడేమీ వద్దమ్మా. స్కూలు ఆయాను పిలిపించు. అన్ని పనులూ చేస్తుంది" తడబడుతూ చెప్పింది మంజరి.

"ఇంటిపనులేమన్నా ఉంటే ఆయాను చెయ్యమను. కాని- మందు నేను తీసుకువస్తా చెప్పు." నందిని తొందరచేసింది. మంజరిని బలవంతాన ఒప్పించింది.

"డాక్టరు రాజుకు చెప్పు, ఏదయినా మందిస్తే తీసుకురా."

నందిని వెళ్ళేసరికి అప్పుడే హాస్పిటల్‌నుండి వచ్చాడు రాజు. నందిని చెప్పగానే డ్రెస్సు మార్చుకోకుండానే అలాగే ఆమెవెంట వచ్చాడు.

రాజును చూడగానే మంజరి పడుకున్నదల్లా సిగ్గుపడుతూ లేచి కూర్చుని "అయ్యో! మీరింత శ్రమ తీసుకుని ఇంతదూరం ఎందుకు వచ్చారు? ఏదో మందు నందిని చేతికి ఇస్తే సరిపోయేదిగా! లేకపోతే నేనయినా వచ్చి తీసుకునేదాన్ని" అంది.

"రోగిని చూడకుండా మందు ఎట్లా ఇస్తారు? సంగతి ఏమిటో తెలియద్దూ?" చెయ్యి పట్టుకుని చూశాడు. ఒళ్లు కాలిపోతున్నది. నాడి పందెంగుర్రం మాదిరిగా పరుగులు తీస్తున్నది.

స్టెతస్కోపుతో ఊపిరితిత్తులు పరీక్ష చేశాడు. థర్మామీటరుతో జ్వరం చూశాడు.

"నేను వెళ్ళి ఇంజక్షను మందు కొనుక్కొస్తాను." గబగబా వెళ్లాడు. అరగంటలోగా వచ్చి ఇంజక్షను ఇచ్చి "కాఫీ ఇస్తూ ఉండండి అప్పు

దప్పుడు మళ్ళీ నేను నాలుగు గంటలకు వస్తాను" నందినితో చెప్పి బయలుదేరుతూ "నందినీ! కాస్త మంజరిని కనిపెట్టి ఉండాలి. మీ ఇంట్లో పెద్దవాళ్ళెవరైనా ఉన్నారా?" అడిగాడు.

"నేనే పెద్దనండీ మా యింట్లో. మా నాన్న రాత్రి పదిదాటిన తరువాత పక్క ఊరినుండి బస్సులో వస్తాడు. మళ్ళీ తెల్లవారి ఆరు గంటల బస్సులో వెళ్ళిపోతాడు." ఇరవై సంవత్సరాలు దాటీదాటని నందిని కొంగు ఒంటినిండా కప్పుకుని ఆరిందాలా మాట్లాడింది.

"నాలుగు గంటలవరకూ కనిపెట్టుకుని ఉంటే చాలు. నేను ఎవరి నయినా తీసుకువస్తాను" అంటూ వెళ్ళిపోయాడు రాజు.

ఐదుగంటలకు రాజు వచ్చేటప్పుడు శిక్షణ పొందుతున్న నర్సును తీసుకువచ్చాడు. మంజరికి నిద్ర పట్టినట్టుంది. మెల్లగా ఊపిరి పీలుస్తు న్నది. జ్వరం జారినట్టుంది. ముత్యాలలా చెమట బిందువులు ఫాలభాగ మ్మీద పొటమరించాయి.

మంజరిని చూస్తూ అలాగే నిలబడిపోయాడు డాక్టరు రాజు. అతడి మెదడులో ఏవేవో చిత్రాలు కదిలిపోతున్నాయి. ఉండి ఉండి ముఖం గంభీరమైపోతున్నది. భ్రూకుటి ముడుచుకుపోతున్నది. ఏవేవో ఆలోచన లతో ఒళ్లు గగుర్పొడుస్తున్నది.

"అయ్యో!" అన్నమాట పెదవులుదాటి బైటికి వచ్చింది.

నందిని తుళ్ళిపడటంతో సర్దుకుని "నందినీ! ఈ నర్సు సువార్త ఇక్కడే ఉంటుంది. పాలు - కాఫీ ఏదడిగినా ఇవ్వవచ్చు. మందులు ఏమే మివ్వాలో నేను సువార్తకు చెప్తాను. కాగితం మీద రాసి ఇస్తాను" అన్నాడు.

దారి పొడుగునా రాజు మనసు కలవరపడుతూనే ఉంది. అతడికి ఎంత ఆశ్చర్యంగా ఉన్నదో అంత భయంగా కూడా ఉంది.

మంజరికి ఒకటే ఊపిరితిత్తి పనిచేస్తున్నది. ఆ ఒక్క ఊపిరితిత్తితోనే ఆమె జీవిస్తున్నది.

కలతనిద్రతో తెల్లవారింది. హాస్పిటల్ డ్యూటీ అయిన తరువాత ఇంటికి వెళ్ళాడు. ఆమె కళ్ళు తెరుచుకునే పడుకున్నది. రాజును చూడగానే సువార్త రిపోర్టు చేతికందించింది

మంజరికి జ్వరం తగ్గింది. ఒళ్ళునొప్పులు కూడా తగ్గాయి. ఉదయం లేవగానే పాలు తాగింది. కాని చాలా నీరసంగా ఉంది.

డాక్టరు మంజరి మంచం దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ఆమె చెయ్యి పట్టుకుని చూశాడు.

"మంజరీ, నీకేం భయంలేదు. జ్వరం తగ్గిపోయింది. బలం పట్టటానికి మందిస్తాను. చూడు నీకు చిన్నప్పుడు ఎప్పుడయినా జబ్బు చేసిందా? జ్ఞాపకం చేసుకో" అన్నాడు.

"కృష్ణ ఎక్కడున్నాడో కబురు తెలిసిందా డాక్టర్?" వినీ వినబడనట్టుగా అడిగింది మంజరి

"తెలుస్తుంది. రేపటికి ఎక్కడున్నాడో తెలిసిపోతుంది. కాని- నేనడిగిన దానికి జవాబు చెప్పు. ఎప్పుడైనా జబ్బుపడ్డావా?"

మంజరికి జ్ఞాపకం వచ్చింది. ఇంటర్మీడియటు చదివేటప్పుడు రోజూ జ్వరం వస్తూ ఉండేది. వార్డెను హాస్పిటల్లో చేర్పించింది. అక్కడ ఏడాదికిపైగా ఉన్నది. రెండేళ్లు చదువు ఆగిపోయింది. చాలా జాగ్రత్తగా ఉండమని డాక్టర్లు ఆదేశించారు. చాలాకాలం మందు వాడింది. తరువాత ఆ సంగతే మరిచిపోయింది. ఆపైన ఒక్కసారన్నా జ్వరం రాలేదు. దగ్గు కూడా రాలేదు. ఆ సంగతి రాజుకు చెప్పింది.

"ఈ జ్వరం దానికి సంబంధించినది కాదు. నీవేం భయపడకు.

"ఎందుకొచ్చిందటారు జ్వరం ?" మెల్లిగా లేచి కూర్చుని అడిగింది మంజరి.

"మనిషన్న తరువాత ఏమీ రాకుండా ఉంటుందా ? ఏమీ రాకుండా ఉంటే మేమంతా ఎందుకు ? సరేగాని - ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకో. జ్వరం తగ్గింది. కాని-మందులూ పథ్యం ఇరవై ఒక్క రోజు వరకూ ఉండాలి. లేచి తిరగ కూడదు. ఉద్యోగానికి సెలవు పెట్టాలి కొన్నాళ్లు బాగా తిరిగేటంతగా ఓపిక వచ్చిన తరువాత పనిలోకి వెళ్లవచ్చు. ఏమాత్రం అజాగ్రత్త చూపినా తిరగబెట్టవచ్చు. ఈ సువార్తమ్మ నీదగ్గరే ఉండి మందూ పథ్యమూ చూస్తూ ఉంటుంది" తాపీగా చెప్పుకుంటూ పోతున్నాడు రాజు.

"అయితే ఇది టైఫాయిడా డాక్టర్ !" పక్కకు తిరిగి కళ్ళమీద చేతులు పెట్టుకుంది మంజరి.

"అబ్బ! రోగులకు జబ్బుల పేర్లెందుకు? అన్నిటికీ నేనున్నానుగా? సువార్తమ్మను ఇక్కడికి పంపించింది ఎందుకు ? నీకు తోడుగా ఉండటానికి. ఇతర ఆలోచనలు పెట్టుకోకుండా ఉంటే త్వరగా తగ్గిపోతుంది" మందలించాడు రాజు.

"రేపు వస్తారా ?" పక్కకు తిరిగే ప్రశ్నించింది.

"ఎందుకు ?"

ఆ మాటకు మంజరికి దుఃఖం వచ్చింది.

"ఇట్లా ఉంటే నేను బాధ్యత తీసుకోను. నేను చెప్పినట్టు వింటే నే కృష్ణ సంగతి కనుక్కుని చెప్పగలను."

"అయ్యయ్యో ! మీకెంత శ్రమ యిస్తున్నాను ?"

"మంజరీ! రేపటినుంచీ నేను రాను. వస్తే ఇట్లాగే మాట్లాడతావు" లేచి రెండడుగులు వేశాడు రాజు.

చివాలున లేచి కూర్చుంది మంజరి. "డాక్టర్ రాజూ! నేనింక కృష్ణను చూడలేనేమోననిపిస్తోంది. అంతకంతకు అతడు నాకు దూరమై అందకుండా పోతున్నాడు." ముఖమ్మీద చేతులు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది మంజరి.

"మంజరీ! మంజరీ! నీవిట్లా ఏడుస్తుంటే మందివ్వటం నా వల్ల కాదు. నీవు నేను చెప్పినట్టు వింటే నీ జబ్బు తగ్గిపోతుంది. ఈలోగా కృష్ణను తీసుకువచ్చే భారం నాది. నా మాట నమ్ము. నీవిలా ఉద్రేకపడుతుంటే ఎంత చిన్న జబ్బయినా మందులకు లొంగదు." ఆమె సమాధానం కోసం ఎదురు చూసినట్టుగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

మంజరి కొంతసేపటికి సర్దుకుంది. ఆమె ముఖంలో ఏడుస్తున్న ఛాయలు అంతగా కనబడలేదు. డాక్టరు రాజు వెంటనే కుర్చీలో నుంచి లేచాడు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అడిగింది మంజరి చిరునవ్వు కనబరుస్తూ.

"వస్తాను, సాధ్యమైనంత తొందరలో వస్తాను. వచ్చేటప్పుడు నీవు చెప్పిన మాట మరచిపోను. ఒక్కడినే రాను. సరేనా?"

సువార్తమ్మకు మెలకువలన్నీ చెప్పి రాజు కదిలాడు.

అతడి నడక మందంగా సాగుతున్నది. కృష్ణ తిరిగి వస్తాడా? వచ్చినా ఈ పెళ్ళి సాధ్యమా? ఆలోచనలు అడవి తీగలా చుట్టుకుపోతున్నాయి.

వారం తరువాత—

రాజు తిన్నగా పాండురంగం ఇంటికి బస్సులో చేరాడు. నాగమణి ఎదురుగా వచ్చింది.

"నేను డాక్టర్ రాజును. మీకు హరికృష్ణ బాగా తెలుసుకదూ ?"

"బాగా తెలియటం ఏమిటి ? మా పిల్లలలో అతడొకడు అన్నట్టుగా ఉంటాడు. ఈమధ్య రావటం తగ్గించేశాడు. పని ఎక్కువయిందంటూ అబ్బాయికి ఉత్తరం రాశాడు." అన్నది ఆమె డాక్టర్ని కూర్చోమంటూ.

"మంజరి ? ఆమె కూడా తెలుసా ? మంజరి ఎప్పుడూ మీ యింటి సంగతులు చెబుతూ ఉంటుంది." ముఖానికి పట్టిన చెమట చేతిగుడ్డతో అద్దుకుంటున్నాడు.

"మంజరి మా యింటికి ఎప్పుడూ వచ్చే పిల్ల. ఇంటి అమ్మాయిలా మసలుకుంటుంది. ఇక్కడికి వస్తే, ఏమిటలా అడుగుతున్నారు? వాళ్లిద్దరూ ప్రేమలో పడ్డారా ఏమిటి ? నాకనుమానం కలిగింది సుమా" అన్నది.

"ప్రేమలో కాస్తా కూస్తా కాదు. బాగా కంఠంలోతు వరకూ దిగారు. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారని హరికృష్ణ రెండుమూడుసార్లు నాతో చెప్పాడు. డిన్నర్ ఏర్పాట్లు- ఎక్కడ ఇచ్చేది- ఎవర్ని పిలిచేది నాతో చెప్పాడు. ఒక నెల సెలవు హనీమూన్‌కని రిజర్వు చేసుకున్నాడు."

"ఇద్దరూ తోడుదొంగలు చూసారా! నాకు మాట మాత్రమయినా చెప్పలేదు !" సంతోషంతో భర్తను పిలిచి "చూసారా ! మన కృష్ణ మంజరీల కథ !" అంటూ పాండురంగానికి రాజు రాకను గురించి చెప్పింది.

"అసలు సంగతి వినండి. ఇప్పుడు కృష్ణ పెళ్ళికి విముఖుడు. మంజరితో చెప్పకుండా కన్యాకుమారి వెళ్ళి వివేకానంద రాక్ మీద కూర్చు న్నాడు. అంతా మర్చిపొమ్మని మంజరితో చెప్పమని నాకో ఉత్తరం

వ్రాశాడు. మంజరి ఇప్పుడు టైఫాయిడ్‌తో మంచమ్మీద ఉంది. కృష్ణ కృష్ణ అని కలవరిస్తోంది" అంటూ మెల్లగా సంగతంతా చెప్పాడు.

నాగమణి ఉత్సాహమంతా నీళ్ళు కారిపోయింది.

"చేసుకుంటానని ముఖం చాటుచేసుకునేవాడు కాదే కృష్ణ?" ఆశ్చర్యం విచారం ఆమె ముఖంలో దోబూచులాడాయి

"అతడికి తన పుట్టుకను గురించిన కాంప్లెక్సు ఒకటుంది. చాలా అసహ్యపడతాడు. కించపడతాడు. రెండవది అతడి రక్తములో రక్త కణాలు తక్కువగా ఉన్నాయి. అంతే. అంటే కేన్సరు కాదనుకోండి. ఈ మధ్యనే పరీక్షచేస్తే తేలింది. అయితే ప్రాణభయం లేదు. అతడికి అనుమానమే కాని నేనింకా చెప్పలేదు." మెల్లిగా వినీ వినబడకుండా చెబుతున్నాడు డాక్టరు రాజు.

తుళ్ళిపడ్డారు నాగమణి, పాండురంగం.

"కేన్సరంటే ఇంక ఆశలేదన్నమాటేనా డాక్టర్!" పాండురంగం రహస్యం చెప్పినట్టుగా అడిగాడు.

"అందులో రకాలున్నాయి. ఆరునెలల్లో ప్రాణంపోయేవి కొన్ని రకాలున్నాయి. కొన్ని ఒకటిరెండు మూడు సంవత్సరాల వరకూ లాగుతాయి. వీటిలో ఏదీకాదు హరికృష్ణది. హరికృష్ణది మామూలుగా మందులిస్తే తగ్గేది." మెల్లగా తల వంచుకుని చెప్పాడు రాజు.

"ఇంకా నయం. పెళ్లయిన తరువాత మంజరి సంగతి బయటపడలేదు. మనం మంజరికే నచ్చచెప్పి అతడిమీద ఆశ వదలుకోమని చెప్పాలి" అన్నది నాగమణి.

"మంజరికి మనం నచ్చచెప్పలేము. ఆ స్టేజి దాటిపోయింది. ఇప్పుడామెకు టైఫాయిడ్. ఒకవారం గడిచింది. హరికృష్ణకు తనమీద ఎందుకో

కోపం వచ్చింది. తన మాటగా వెళ్ళి అతడికి నచ్చచెప్పి తీసుకురమ్మంటుంది. నేనింత దూరం ఎందుకు వచ్చానంటే పరిస్థితులన్నీ మీకు ముందుగా చెప్పాలనీ- మనమందరం కలిసి వాళ్ల సంగతులు చర్చించి ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుందనీను. ఎందుకంటే వాళ్ళిద్దరికీ కావలసిన వాళ్లెవరూ లేరు. ఏది చెప్పినా మనమే చెప్పాలి" అన్నాడు.

"అయితే కృష్ణను తీసుకువచ్చి అతడిచేతనే చెప్పించాలి పెళ్ళి పొసగదని" విచారంతో ముఖం దించుకుంటూ చెప్పింది నాగమణి.

"మంజరి ఆరోగ్యం ఇంతటి విచారకరమైన వార్తను భరించలేదు. ఆమె గుండె టక్కున ఆగిపోవచ్చు," అన్నాడు డాక్టరు.

"ఇప్పుడు తొందరేం మనకు ఆ మాట చెప్పటానికి? ఆమెకు జ్వరం సాంతం తగ్గిన తరువాత చెప్పవచ్చు," నాగమణే అన్నది మళ్ళీ.

"జ్వరం కొన్ని కేసులలో ఇరవై ఒక్క రోజు తరువాత తిరగబెట్టుతుంది. అట్లా తిరగబెట్టకుండా చూస్తాననుకోండి. అసలు సంగతేమిటంటే మంజరి ఒక ఊపిరితిత్తి మీదనే బ్రతుకుతున్నది. ఎంతకాలం నుండీ ఇట్లా ఉన్నదో తెలియదు కనుక ఆమెపట్ల మనం జాగ్రత్తగా మసలుకోవాలి," అన్నాడు రాజు.

"ఆమెకు తెలుసా ఈ సంగతి?" నాగమణి పాండురంగం ఒక్కసారే అదిరిపడ్డారు.

"తెలిసినట్టు లేదు."

"అయితే ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? కృష్ణకు తన సంగతి తెలియదు. మంజరికీ తన సంగతి తెలియదు. ఇటువంటి పరిస్థితులలో

మనమేపని గానీ బాగా ఆలోచించి చేయాలి. వాళ్ళ భవిష్యత్తుకు మనం బాధ్యత వహిస్తున్నామన్న మాట. డాక్టర్! ఒకవేళ వాళ్ళు పెళ్ళి చేసుకున్నా ఏం సుఖపడతారు?" నాగమణి లోపలికి వెళ్ళి కాఫీ బిస్కట్లు తెచ్చింది. పాండురంగం, డాక్టరు చేతికి కాఫీ కప్పు అందించాడు.

"సుఖమంటే— అందరిమాదిరిగా పిల్లలు పుట్టటానికి వీలులేదు. కాన్పుల భారము మంజరి వహించలేదు." సూటిగా చెప్పాడు డాక్టరు.

"అతడి సంగతి?" పాండురంగం పెదవులు చప్పరిస్తూ అడిగాడు.

"ఇంజక్షను, మందు తీసుకుంటాడు. ఇదీ వాళ్ళిద్దరి పరిస్థితి" డాక్టరు కాఫీ, బిస్కట్లు తీసుకుని సిగరెట్టు వెలిగించాడు.

పాండురంగం ఆలోచనలో పడ్డాడు. ఇటువంటివాళ్ళు పెళ్ళి చేసుకోకపోతే ఏం? వాళ్ళకు ఉన్నసంగతి ఉన్నట్టు చెప్పెయ్యటమే మేలన్న నిశ్చయానికి వచ్చాడు. నాగమణి కాఫీ కప్పులు లోపల పెట్టి వచ్చే అంతలో పాండురంగం డాక్టరుతో చెప్పాడు. "వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసి ఆ పాపం మనం మూటకట్టుకోవద్దు" అంటూ.

"పెళ్ళి చెయ్యకపోతే వాళ్ళిద్దరూ దిగులుతో మంచానపడి త్వరలోనే ప్రాణాలు విడుస్తారు" దిగ్గున లేచాడు డాక్టరు.

నాగమణి "ఆఁ!" అంటూ నోరు తెరిచింది.

"అయితే మనం వాళ్ళను పెళ్ళికి సిద్ధం కమ్మని అనాలా?" పాండురంగం ఒక విధమైన భయం సంకోచం ముఖమ్మీద ప్రస్ఫుటమవుతూ ఉంటే అణుచుకుంటూ అన్నాడు.

"అనాలి. కాని వాళ్ళిద్దరికీ ఆరోగ్యాల సంగతే చెప్పకూడదు. అంతా దైవమ్మీద భారంవేసి చెయ్యాలి." గంభీరంగా అన్నాడు డాక్టరు.

కళ్ళు పెద్దవిచేసి వింటున్నాడు పాండురంగం.

"నేను హరికృష్ణను తీసుకువచ్చి చూపిస్తానని మంజరికి మాట ఇచ్చి ఇలా వచ్చాను. ముందు హరికృష్ణను చూడాలి. అతడికి నచ్చచెప్పి మంజరి దగ్గరికి తీసుకురావాలి. ఇది చాలా కష్టమైన పని. కృష్ణ చాలా పట్టుదలగల మనిషి. మంజరికి ఈ జన్మలో ముఖం చూపించలేనని నాకు వ్రాశాడు. మీరు కూడా వస్తే ఒకరికిద్దరం ఉంటాము కనుక ఇద్దరం నచ్చచెబితే అతడు పట్టు విడుస్తాడని నా నమ్మకం. ఇందుకు మీ సహకారం చాలా అవసరం. నాకు తోచినమాట చెబుతున్నాను. ఈ పద్ధతి అయితే వాళ్ళిద్దరి పరిస్థితులకూ అనుకూలమయినది" లేచాడు కుర్చీలో నుంచి డాక్టరు.

"డాక్టర్! నాకు ధైర్యము తక్కువ. ఇటువంటి పరిస్థితులను నేను ముఖాముఖి ఎదుర్కోలేను. నా సహకారం మీ కెప్పుడూ ఉంటుంది. కాని నేను స్వయంగా కృష్ణ ముఖం చూసి చెప్పలేను. నన్ను క్షమించండి" రెండు చేతులూ జోడించాడు పాండురంగం.

"అలా కాదు. మనిద్దరం వాళ్ళిద్దరి శ్రేయోభిలాషులం. మనిద్దరం కలిసే వాళ్ళ విషయంలో ఏ పనయినా చెయ్యాలి. మీరు మాట్లాడలేకపోతే పోనీయండి. నా ప్రక్కన నిలబడండి. అదే చాలు. నాకు కొండంత బలం. రండి వెళ్దాము. రేపు ఉదయం బయలుదేరుదాం. మీరు మళ్ళీ మనసు మార్చుకోవద్దు" భుజం తట్టి చెప్పాడు ప్రతిమాలుతున్నట్టుగా డాక్టరు.

నాగమణి డాక్టర్నీ, పాండురంగాన్నీ అయోమయంగా చూస్తున్నది. ఆమెకు కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

వాళ్ళిద్దరికీ పెళ్లిచేస్తే ఏమో!

పెళ్లి చెయ్యకపోతే ఏమో ?

ఈ రెండు ప్రశ్నలూ పెనుభూతాల్లా ఆ రాత్రంతా నాగమణి పాండురంగం లను భయపెడుతూనే ఉన్నాయి.

తెల్లవారగానే భారంగా లేచారిద్దరూ.

# 10

రెండు చేతులు బలంగా భుజమ్మీద పడగానే ఉలిక్కిపడి వెనక్కి తిరిగిచూశాడు కృష్ణ. డాక్టరు రాజు, ఆయన వెనుక పాండురంగం నిలబడి ఉన్నారు.

"మీరెప్పుడొచ్చారు ?" వినీ వినబడనట్టుగా అని వాళ్ళవైపు తిరిగాడు కృష్ణ. వాళ్ళను చూసి గతుక్కుమన్నట్టు అతడి ముఖమే చెబుతున్నది.

"వివేకానందుడి ధ్యానమందిరంలో కూర్చుని నీవెంత ధ్యానముద్రలో ఉన్నావో - పాపం - ఎందుకు ధ్యానభగ్నం కావించటమని నీ వెనుక నిలబడి చూస్తున్నాము. మేము వచ్చి అరగంటకు పైగా అయింది." కృష్ణ ముఖంలోకి చూశాడు డాక్టరు రాజు. సరిగా భోజనంచేసి ఎన్ని రోజులయిందో ముఖం పీక్కుపోయింది. కళ్ళు గుంటలు పడ్డాయి. మనిషి నిద్రలోనుంచి లేచివచ్చిన వాడిలా ఉన్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు కావచ్చింది. అందరికీ కడుపులో చురచుర మంటున్నది.

"కృష్ణా! ఇక్కడెక్కడయినా మాకు భోజనం పెట్టించవూ ? మేము పొద్దుటినుండీ కాఫీ అయినా తాగలేదోయి. వెర్రి తలనొప్పి వచ్చేసింది" అన్నాడు రాజు కణతలు పట్టుకుని.

"రండి. మనం లాంచిలో ఆవతలిగట్టుకు చేరి కాంటీన్‌లో భోజనం చేద్దాం." అంటూ ముందుకు దారితీశాడు. వాళ్లు మెట్లన్నీ దిగేసరికి ఆవతలి నుంచి లాంచి అప్పుడే వచ్చింది. ముగ్గురూ ఎక్కి ఆవలిగట్టుకు చేరుకున్నారు.

భోజనాల దగ్గర ఎవరూ మాట్లాడలేదు. రాజు బిల్లు చెల్లించాడు. అందరూ స్నానాలరేవు దగ్గర రైలింగ్స్ ముందు కూర్చున్నారు.

ముక్కాదలి వెర్రిగా ఘోషిస్తోంది. అలలు ఎగిసి పడుతున్నాయి. ముగ్గురూ ఎవరి ఆలోచనలలో వాళ్ళున్నారు.

వాళ్ళిద్దరూ ఎందుకు వచ్చి ఉంటారా అని ఆలోచిస్తున్నాడు కృష్ణ తనంతట తను బయటపడి అడగదలచుకోలేదు. అయినా అవన్నీ తనకెందుకు? తను అన్నిటినీ వదలుకుని మనశ్శాంతికోసం వచ్చినవాడాయెను.

"కృష్ణా, ఇక్కడ మంచి భోజనమే దొరుకుతుందోయ్" అన్నాడు రాజు ఉపోద్ఘాతంగా.

ఆ మాటకు కృష్ణకు నవ్వు వచ్చింది. కాని పెదవుల మధ్యనే బిగించేసి అవునన్నట్టుగా తల ఊపాడు.

"నేనిక్కడికి ఎందుకు వచ్చానా అని అనుకుంటున్నావు కదూ! డాక్టరు ఆల్బర్టు నాకు ఉత్తరం వ్రాశాడు. తన ఆస్తి అంతా ఆ యిద్దరి కొడుకులతో పాటు నీకు కూడా పంచేశాడట. ఏభయి వేలు డాలర్ల రూపంలో పంపించాడు నీకిమ్మని. తను వచ్చినప్పుడు నిన్ను చూడాలని ఎంతో అనుకున్నాడట తాత కోసం, అమ్మకోసం, డాక్టరుకోసం అందర్నీ అడిగాడట. నిన్ను దూరంనుంచే చూశాడట. అతడికి ఎవరో చెప్పారట-నీకు విదేశీయులంటే కోపమని. అందుకని నిన్ను కలుసుకోవటానికి సాహసించలేదట." రాజు మాట పూర్తి చేయకముందే "ఇందుకా ఇంతదూరం

పాండురంగంగారిని కూడా వెంట తీసుకువచ్చారు" అని మనసులో అనుకుని.

"శ్రమ పడ్డారు అనవసరంగా. మీరిదివరకే మాటల సందర్భంలో ఏభయివేల చెక్కు సంగతి చెప్పారు" అన్నాడు కృష్ణ ఆ సంగతి పాతదే కదా అన్న ధోరణిలో.

"నేనందుకు రాలేదు కృష్ణా. అసలు సంగతేమిటంటే నీవు పరీక్షకు రక్తమిచ్చి వచ్చావు కదా. నీవు వెళ్ళగానే టెస్టు చేశాను. మామూలుగా ఉంది. కాకపోతే కొంచెం పలచగా ఉందనుకో. దానికి ఇంజక్షనులయినా తీసుకోవచ్చు. లేకపోతే టానిక్కులయినా తీసుకోవచ్చు కొంచెం పుష్టికరమైన ఆహారం తీసుకుంటూ ఉండు. నీతో ఈ మాట చెబితే నీ మనసుకు శాంతిగా ఉంటుందని చెప్పటానికి వస్తుంటే పాండురంగంగారు తనెప్పుడూ వివేకానందరాక్ చూడలేదంటూ నావెంట వస్తానన్నారు" చాలా మామూలుగా ఏమాత్రం ఉద్రేకం లేకుండా చెప్పుకుంటూ పోతున్నాడు రాజు.

నిర్లిప్తమయిన నవ్వొకటి నవ్వేశాడు కృష్ణ.

"ఇదయినా ఒక కార్డు రాసి పడెయ్యొచ్చుగా!" అన్నాడు కృష్ణ.

"ఇక మీరందుకోండి" అన్నట్లు పాండురంగం ముఖంలోకి చూశాడు.

"నువ్వీ మధ్య మా యింటికి రావటంలేదు. మీ అక్క చాలా సార్లు అనుకుంది. మంజరిని అడిగితే నీ సంగతంతా తెలుస్తుందని మొన్న మంజరి ఇంటి కెళ్ళాను" సగంలో ఆపి రాజువంక చూశాడు పాండురంగం.

ఎటో చూస్తూ అనాసక్తంగా వింటున్న కృష్ణ పాండురంగం ఆ పేటప్పటికి అనుకోకుండా ఆయనవంక చూశాడు ఇంకా చెప్పండి అన్నట్లు.

ఫరవాలేదు-మనిషిలో కాస్త చలనం వచ్చిందనుకున్నాడు పాండురంగం.

"ముఖ్యంగా నేనేమకున్నానంటే-కాదు కాదు-నేనెందుకు ఇంత దూరం వచ్చానంటే-మంజరి ఇంటికి వెళ్ళానని చెప్పానా? నేను వెళ్ళేసరికి మంజరి జ్వరంతో ఒళ్ళు తెలియకుండా పడుకోనున్నది. అప్పుడప్పుడు కృష్ణా కృష్ణా అని కలవరిస్తున్నది. మంజరి సంగతి నీకు చెప్పాలనే వచ్చాను'' అన్నాడు పాండురంగం.

చలించినట్టు కనబడ్డాడు కృష్ణ. ఆదర్దా ముఖలో కొట్టవచ్చినట్టు కనబడుతునే ఉంది. కాని - అదంతా అణచుకోవటానికి విఫలయత్నం చేస్తున్నాడు.

"నేనే వైద్యం చేస్తున్నాను కృష్ణా మంజరికి. టైఫాయిడ్ కేసు. జ్వరం తగ్గింది. కాని దానికోర్సు ఇరవై ఒక్కరోజూ రెస్టు తీసుకుంటూ ఉండాలి. నీకు తెలియనిదేమున్నది? మందులు జాగ్రత్తగా వాడుతున్నాను. మన హాస్పిటల్లో ఉండే టెక్నీషియన్ జాకబు చెల్లెలు సువార్తను మంజరిని కనిపెట్టుకుని ఉండమని నియమించాను" రాజు ఎగెసెగిసి పడుతున్న అలలవైపు చూస్తూ చెప్పాడు.

కృష్ణ ఏమీ మాట్లాడలేదు. కాని అతడి మనసంతా కల్లోలంగా ఉంది. మంజరికి టైఫాయిడనగానే బాధతో గుండె కదిలినట్లనిపించింది. మంజరి ఎవరో కాదు నీ గుండె అన్నట్టు అతడి హృదయం కంపించింది. అయినా బంధనాలనన్నిటినీ తెంచుకుని ఇక్కడికి వచ్చేశాను. అనుకుంటూ నిబ్బరంగా ఉండటానికి ప్రయత్నించబోతున్నాడు.

పది నిముషాలు కృష్ణ మాట్లాడతాడని ఎదురు చూశాడు రాజు. ఇక ఉండబట్టలేక "కృష్ణా! నీవు వచ్చి ఒక్కసారయినా ఆమె కంటబడక పోతే ఆమెకు మనోవ్యధ అధికమవుతుంది. జబ్బు నయం కావటంలో ఆలస్యమవుతుంది" అన్నాడు రాజు.

"నేను మళ్ళీ ఆ ఊరికి రాదలచలేదు. నన్ను ప్రలోభపెట్టకండి డాక్టర్. నేను వచ్చేనాడు మళ్ళీ ఆ పరిసరాలు తొక్కనని ఒట్టుపెట్టుకుని వచ్చాను. అంతే. ఇంక నా మనసు మారదు" ఎక్కడలేని కాఠిన్యాన్నీ తెచ్చుకుని కరుకుగా అన్నాడు కృష్ణ.

"ఏం చేసినా యా పరిసరాలు? అక్కడ ఉన్న మేమంతా నీకు శత్రువులమా? పాండురంగం గారింట్లో వాళ్ళబ్బాయిలా మసలుకున్నావట. నాకయితే నీవు చిన్నతమ్ముడివి. మేమేమయినా మాకు తెలియకుండా నీకు హాని తలపెట్టామా? చెప్పు? మేము దిద్దుకుంటాము" కృష్ణ భుజాలు పట్టుకుని ఊపుతూ అన్నాడు రాజు.

రాజు మాటలకు కృష్ణ కళ్ళనుండి కన్నీరు జలజలా రాలింది. తను బుద్ధి తెలిసిన తరువాత ఎవరి ఆప్యాయతకూ నోచుకోలేదు. అటువంటి వాడికి ప్రేమా ఆప్యాయతా ఇట్లా ఉంటాయని తెలిసినవారు మంజరి - రాజు - పాండురంగం కుటుంబం. నాగమణి అక్క తల్లిలా పలకరిస్తుంది. అదంతా కళ్ళముందర మెదలగానే అతడికి పట్టరాని దుఃఖం వచ్చేసింది.

కాని అతడు మంజరిని చూడలేడు. చూస్తే తన నిశ్చయం సడలిపోతుంది.

"పాపం తల్లిదండ్రులు లేని అనాథ మంజరి. ఆమె ప్రాణం నిలబెట్టు కృష్ణా!" చెమర్చిన కళ్ళను రుమాలుతో అద్దుకుంటున్నాడు పాండురంగం.

కన్యాకుమారి సవాలు చేస్తున్న ముఖం కళ్ళకు కట్టినట్లయింది. భగ్న హృదయలైన భారత కన్యల హృదయం ఆ కన్యలో మూర్తీభవించినట్లున్నదని మొదటి చూపులోనే కృష్ణమనసుకు తట్టింది. అయినా తనేం చేయగలడు అన్నట్లు చేతులు ఇటూ అటూ తిప్పాడు.

"కృష్ణా! నీవు కనుక ఇక్కడినుంచి కదలకపోతే మేమూ ఇక్కడే ఉంటాము. మా కుటుంబాలు ఏమన్నా కానీ - పిల్లా పాపలతో మాడిపోయినా సరే - ఇక్కడినుంచి ఒక్క అడుగయినా కదలము" గంభీరంగా ముఖంపెట్టి అన్నాడు పాండురంగం.

కృష్ణ మనసు కదిలిపోయింది.

"నేను ఎటువంటి ఉద్రేకమూ లేని పాషండుడనై పోయాను. వచ్చి - ఏం చెయ్యగలను? నా మనసు రాయి నల్లరాయి అయిపోయింది. సుఖమూ - దుఃఖమూ - ద్వేషమూ నన్ను కదిలించలేవు" ప్రవచనంలా చెప్పాడు కృష్ణ!

రాజుకు నవ్వురాబోయింది. కాని అదిమిపెట్టాడు ఇది సమయం కాదనుకుని.

పాండురంగం తెల్లబోయి చూస్తున్నాడు కృష్ణను.

"విరక్తులయిన యతులుకూడా తన చూపువల్ల పోయే ప్రాణ మేదయినా నిలుస్తుందంటే రావటానికి సందేహించరు సందేహించకూడదు. మానవత్వము లేనివాడు ఎంత నిర్లిప్తుడయినా యోగి అవుతాడా? తప్పించుకు తిరిగేవా డవుతాడుగాని! వట్టి స్వార్థపరుడవుతాడు." రాజు కంఠం మారు మ్రోగింది

కృష్ణ తలవంచుకున్నాడు.

"నాకు నీ సంగతి మొదటి నుంచీ తెలుసు. సాంఘికంగా నీకేదో లోపమని లోపల్లోపల కుళ్లుతూ ఉంటావు. నీ తల్లి ఆల్బర్టును తప్ప మరెవరినీ మనసులో తలవలేదు. ఆమె అతడి ఫోటోను దగ్గర పెట్టుకుని ఆఖరి రోజువరకూ కాలం గడిపిందని నాకు బాగా తెలుసు తాతదగ్గరుంటే మళ్ళీ పెళ్ళికి యత్నం చేస్తాడని ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది. ఆల్బర్టయినా ఆమెను మోసగించలేదు. ఇప్పుడు చెప్పు నీ కెందుకు అతడిమీద ఆంత

ద్వేషం? అతడి బాధ్యతను అతడు తెలుసుకునే ఏభయివేల చెక్కు నాకు పంపించాడు నీకిమ్మని. నీ ఫొటో ఒకటి ఆ డాక్టరమ్మ ఇంట్లోనుంచి సేకరించాడని నాకు తెలిసింది. అతడి ఆల్బంలోని నీ తల్లిఫోటో ఇంకా ఉందని నాకు వ్రాసిన ఉత్తరంలో ఉంది. నిన్ను ప్రోత్సహించి తన దేశం ఒకసారి పంపమని కూడా నాకు వ్రాసిన ఉత్తరం చివరలో వ్రాశాడు. ఇక్కడయినా అక్కడయినా ఒక మంచి పిల్లను పెళ్ళిచేసుకొమ్మని చెప్పమన్నాడు నీకు." కథ చెప్పినట్టు చెప్పాడు రాజు.

భరించలేనన్నట్టుగా కృష్ణ తల తిప్పాడు.

"ఆ మంజరి? ఎంత అమాయకురాలు కాకపోతే నీవంటి పాషండుడిని నమ్మి అంతగా ప్రేమిస్తుంది? ఇప్పుడు ఒకటే కలవరింతలు, ఆమెకా పాపం ఎవరూ లేరు. నిన్నే నమ్ముకుని హిమాలయాలంత ఎత్తుగా ఆశలను పెంచుకుంది. ఆమె ఆశలన్నీ కూకటి వేళ్ళతో పెళ్ళగించేశావు. ఆ పిల్ల ఇంక బ్రతకదు" నిష్ఠూరంగా అని ముఖం పక్కకు తిప్పుకున్నాడు రాజు.

"నా మనసులో దురుద్దేశం ఏమాత్రంలేదు" రాజు భుజమ్మీద తలవాల్చి బావురుమన్నాడు కృష్ణ.

"లేకపోతే మాతో ఇంటికి రా" పెదవులు బిగపట్టి అన్నాడు రాజు.

చేతులు దులుపుకుని దిగ్గునలేచి నిలబడ్డాడు కృష్ణ.

రాజు పాండురంగం ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని తృప్తిగా కళ్ళతోనే నవ్వుకున్నారు.

పన్నెండేళ్లూ పరదేశం పోయినవారికి ఊరిముందరికి వచ్చిన తరువాత తన వాళ్ళను చూడాలన్న ఆత్రం ఎక్కువయిందన్న సామెతగా

కృష్ణ మనసు మంజరికోసం వాయువేగ మనోవేగాలతో పరుగులు తీస్తున్నది.

ఆ రాత్రి ఆఖరి బస్సులో ఇళ్ళకు చేరుకున్నారు వాళ్ళిద్దరూ కృష్ణతో.

కృష్ణ ఆదుర్దానంతా ఒకకంట కనిపెట్టున్న రాజు తనలో తానే నవ్వుకున్నాడు. ప్రేమకు బలమెక్కువే సుమా! అనుకున్నాడు.

# 11

ఇరవై ఒక్కరోజు దాటిన తరువాత మంజరిని రాజు పరీక్షచేసి, పథ్యం పెట్టించాడు. విటమిన్ ఇంజక్షనులు ఇచ్చాడు నెల తిరిగేసరికల్లా మంజరి మిసమిసలాడుతూ నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లు చెప్పటం మొదలు పెట్టింది. కృష్ణ గాలినింపిన బెలూనులా నిగనిగలాడుతున్నాడు.

ఎన్నో ఏళ్ళ తరువాత కలుసుకున్నట్టుగా వాళ్ళ సంబరమూ, సంభ్రమమూ ఇంకా ఇద్దరిలో తగ్గలేదు. మళ్ళీ వెళ్ళిపోదు కదా అన్నట్టుగా కొంగుకు ముడివేసుకున్నట్టు చెయ్యి విడవకుండా వెంట వెంట తిరుగుతోంది మంజరి. మంజరీ కృష్ణల పెళ్ళి అనుకోనంత వైభవంగా జరిగింది. కన్యకు తండ్రి పాండురంగం - వరుడికి తండ్రిగా రాజు కాళ్ళు తొక్కుకుంటూ తిరిగారు. వేళకు నిద్రాహారాలు తలపెట్టకుండా ఏర్పాట్లు చేశారు.

కాని - వాళ్ళిద్దరి మనసుల్లో కొండంత దిగులు! చేతులారా చేసిన ఈ పెళ్ళి పదికాలాలపాటు నిలబడాలి. ఆయుర్దాయమిచ్చిన దైవము మరిచిపోయి వాళ్ళ ముఖాలు చూసి ఆనందించాలి ఈ మాటలనుకుంటూ అంతా దేవుడిమీద భారంవేసి పెళ్ళి జరిపించారు ఇద్దరూ.

నాగమణికి మంజరికి అలంకరించటంతోనే సరిపోయింది. అలంక రించిన తరువాత మంజరిని తదేక దృష్టితో చూసి- వెంటనే "దృష్టి తగులు తుందబ్బా మంజరికి" అనుకుంటూ ముఖం తిప్పుకున్నది.

"అక్కా ! మీరూ పాండురంగంగారు, డాక్టరుగారు చేసిన మేలుకు నేను ఎంతచేసినా ఋణం తీరదు". కంటతడి బెట్టి కౌగలించుకున్నది మంజరి.

"సరేలే, మళ్ళీ మొదటికి రాకు. ఇందులో ఏముంది ? ఎవరికి చేత నయిన పని వాళ్లు చేశారు. చూడు మంజరీ ! నేనొక మాట చెప్పాలను కుంటున్నాను. మీ సంతోషాన్ని పాడుచేశానను కోవద్దు. నీవు ఈ మా త్రలు మాత్రము మరిచిపోకుండా ఈకాగితంలో రాసినట్లుగా వాడుకో. ఏమారకు. మీరిద్దరూ సుఖంగా ఊళ్ళు తిరిగిరండి" అని ఒక పాకెట్టు చేతిలో పెట్టింది.

కృష్ణ మంజరీలు సామాను సర్దుకుని హనీమూన్‌కు బయలుదేరు తుంటే రాజు వాళ్ళిద్దరూ ఒక ఏడాది సుఖంగా ఉన్నా చాలుననుకున్నాడు. పాండురంగం మనసు బిక్కుబిక్కు మన్నది. వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసిన తృప్తి మిగిలిందనుకున్నా చాలుననుకున్నాడు.

# 12

మంజరీ కృష్ణలు చారిత్రక ప్రదేశాలు తిరిగారు. పుణ్యక్షేత్రాలను దర్శించారు. రమణీయమైన ప్రాంతాలు కన్నులపండువుగా చూశారు. కొత్త ప్రదేశాలు - కొత్త వాతావరణము - కొత్త కొత్త అనుభూతులు - నవనవో న్మేషమయిన ఆశలూ, ఆశయాలు వాళ్ళిద్దరికీ కొత్త జీవితాల్నిచ్చాయి. కొండంత బలాన్నిస్తున్నాయి.

ఒకనాడు కృష్ణ "మంజరీ, నాకీ కాశ్మీరదేశం వదిలిపెట్టాలని లేదు. ఇక్కడికి వచ్చిన తరువాత నా మనస్సు, నా స్వభావము అంతా మారి పోయాయి. మన జీవితాలు ఇక్కడే గడుపుదాము" అన్నాడు కాఫీ చేతి కిస్తున్న మంజరితో.

"అయ్యో! మన ఉద్యోగాలు?" అంటూ నోరు తెరిచింది మంజరి.

"పిచ్చి మంజరీ! మన కా ఉద్యోగాలు శాశ్వత మనుకున్నావా? అటువంటివి ఇక్కడ దొరకవా? దొరక్కపోతే ఇద్దరం పదిమంది పిల్లలకు చదువు చెబుదాము. అన్నట్టు మరిచిపోయాను. నీ చేతిలో మరో కళ ఉందిగా సూదీ, దారం!" ఆమె వీపుమీద తట్టుతూ పగలబడి నవ్వాడు.

"అవుననుకోండి. అయినా మనవాళ్ళకు ఎప్పటికీ దూరమయి పోతామనుకుంటే బాధగా ఉంది" నసిగింది మంజరి.

"అప్పుడప్పుడు వెళ్ళి చూద్దాం" ఆమెను అనునయించాడు కృష్ణ.

కృష్ణ, మంజరీలు వారానికి ఒక ఉత్తరం డాక్టరుకు - పాండు రంగానికి మరిచిపోకుండా క్షేమంగా ఉన్నామని వ్రాస్తూ ఉంటారు.

"అమ్మయ్య! మనం పొరబాటు పని చెయ్యలేదు. మంచిపనే చేశాము" అనుకుంటారు రాజు, పాండురంగం కలుసుకున్నప్పుడల్లా.

"అక్కా! ఇంకా ఎన్నాళ్ళు మాత్రలు వాడను?" అంటూ మంజరి వ్రాసిన ఉత్తరానికి "నేను వద్దనేవరకూ వాడుతూ ఉండు" అని నాగమణి జవాబు వ్రాస్తూ ఉంటుంది, రాజుతో చెప్పి.

ఒకటీ - రెండూ - మూడూ - నాలుగూ - ఐదూ సంవత్సరాలు మంజరీ, కృష్ణల దగ్గర నుంచి క్షేమవార్తలు రాజుకూ, పాండురంగానికీ తెలుస్తూనే ఉన్నాయి. ఇంకా- ఇంకా ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి.

మంజరీ, కృష్ణలు ఇద్దరూ జంటగా- నవదంపతులలా- చిన్నగా- చిలిపిగా- మూడో వ్యక్తికి తావివ్వకుండా వాళ్ళిద్దరే ఉంటున్నట్టుగా ఉత్తరాలు వస్తూ ఉన్నాయి. నాగమణి మాత్రలు ఎప్పుడు ఆపమని రాస్తుందా అని మంజరి ఎదురుచూస్తూనే ఉంది.

శిశిర వసంతాలు పోతూ ఉన్నాయి - తిరిగి వస్తూ ఉన్నాయి.

(కన్నడ ఆంగ్ల భాషల్లో అనువదించబడింది)

[1974 - యువ]